



నేడే కూటమి సభ

కశింకోట మండలం తాళ్లపాలెంలో నిర్వహణ

- ప్రధాని నరేంద్రమోదీ, తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు రాక
- సాయంత్రం 5 గంటలకు ప్రారంభం
- విస్తృతంగా ఏర్పాట్లు



సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు

అనకాపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెంలో సోమవారం కూటమి (తెలుగుదేశం, జనసేన, బీజేపీ) నిర్వహించనున్న బహిరంగ సభకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, అసెంబ్లీ అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించనున్న ఈ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని నరేంద్రమోదీతో పాటు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పాల్గొననున్నారు.

తాళ్లపాలెం సభకు ప్రధాని హాజరుకానున్న నేపథ్యంలో జిల్లాకు చెందిన కూటమి నాయకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ప్రధాని రాజమహేంద్రవరంలో ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న అనంతరం ప్రత్యేక హెలికాప్టర్‌లో సాయంత్రం నాలుగు గంటలకు బయలుదేరి 4.50 గంటలకు తాళ్లపాలెం చేరుకుంటారు. అక్కడ నుంచి బహిరంగ సభా వేదిక వద్దకు చేరుకొని ప్రసంగిస్తారు. సాయంత్రం 5.45 గంటలకు రోడ్డు మార్గంలో విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకొని అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో అహ్మదాబాద్ వెళ్లనున్నారు.



సభా ప్రాంగణం వద్ద స్వాగత ఏర్పాట్లు

సభా ప్రాంగణంలో ఏర్పాట్లు

తాళ్లపాలెంలో జాతీయ రహదారికి సమీపంలో సుమారు 80 ఎకరాల లేఅవుట్ స్థలాన్ని ప్రధాని మోదీ, చంద్రబాబు సభ కోసం సిద్ధం చేశారు. భద్రతా చర్యల్లో భాగంగా కేంద్ర పోలీసు బలగాలు ఇప్పటికే సభా ప్రాంగణాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. అలాగే పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేసింది. తాళ్లపాలెంలో ... మిగతా 6వ పేజీలో

ఉత్తరాంధ్రపై ఉత్తుత్తి ప్రేమ..

జగన్ ఐదేళ్ల పాలనలో అంగుళం కూడా కదలని సుజల స్రవంతి ప్రాజెక్టు

- ప్రాజెక్టుపై వైసీపీ సర్కారు నిర్లక్ష్యం
- మొదటి దశ పనులకు రూ.2,022 కోట్లు అవసరం
- టీడీపీ హయాంలో టెండర్‌ల ప్రక్రియ పూర్తి
- కాంట్రాక్టర్‌కు రూ.12.8 కోట్లు మొబిలైజేషన్ అడ్వాన్స్
- వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిలిచిన పనులు
- బడ్జెట్‌లో ఏటా అరకొరగా నిధుల కేటాయింపు
- ఒక్క రూపాయి కూడా విడుదల చేయని వైనం
- గతంలో పనులు చేసిన కాంట్రాక్టర్‌కు రూ.8 కోట్లు పెండింగ్
- నిధుల కొరతతో ముందుకుసాగని భూ సేకరణ ప్రక్రియ
- ప్రాజెక్టు పూర్తయితే ఉత్తరాంధ్రలో 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం
- మూడేళ్ల క్రితమే రూ.17,050.2 కోట్లకు చేరిన అంచనాలు

(అనకాపల్లి/విశాఖపట్నం -ఆంధ్రజ్యోతి)

ఉత్తరాంధ్రలో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాల్లో 30 లక్షల మందికి తాగునీరు అందించేలా రూపొందించిన 'ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు'కు గ్రహణం పట్టింది. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన ఈ ఐదేళ్లలో పనుల్లో ఎటువంటి కదలిక లేదు. ప్రాజెక్టు పనులకు నిధులు కేటాయిస్తున్నట్టు బడ్జెట్‌లో లెక్కలు చూపుతున్న పాలకులు ఒక్క రూపాయి కూడా విడుదల చేయడం లేదు. కనీసం గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు కూడా క్లియర్ చేయలేదు.





అనకాపల్లి జిల్లా రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల సరిహద్దులో పెదపూడి రిజర్వాయర్ నిర్మించాల్సిన ప్రాంతం (ఫైల్)

ప్రాజెక్టు ప్రణాళిక

ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని 46 మండలాల్లో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు, 1,200 గ్రామాలకు తాగునీరు అందించే ఉద్దేశంతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి రూపకల్పన చేశారు. మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ పేరుతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం భూముల విలువ, నిర్వాసితులకు ఇచ్చే ప్యాకేజీలు పెరగడంతో దశాబ్దకాలంలో రూ.7,214 కోట్ల నుంచి రూ.16,568 కోట్లకు చేరింది. ఇందులో తొలిదశ పనులు రూ.2022.2 కోట్లతో చేపట్టేందుకు తెలుగుదేశం ప్రభుత్వం 2017 సెప్టెంబరు ఐదో తేదీన జీవో నంబర్ 53 ప్రకారం పరిపాలనా అనుమతి మంజూరుచేసింది. తరువాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం...2021లో ప్రాజెక్టు అంచనాను రూ.17.050.2 కోట్లకు పెంచుతూ పాలనామోదం ఇచ్చింది తప్ప...ఇంత వరకూ పైసలు విడుదల చేయలేదు.

పథకం పనితీరు ఇలా

గోదావరి జలాలను పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా పోలవరం కుడి కాలువకు తరలిస్తుండగా పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా ఎడమ కాలువకు సరఫరా చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా బూరుగుపూడి సమీపంలో ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటుచేసి, అక్కడి నుంచి ఏలేరు జలాశయంలోకి నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి గతంలోనే ఉన్న కాలువ ద్వారా గోదావరి జలాలను విశాఖ ఉక్కు కర్మాగారానికి, విశాఖ ప్రజల తాగునీటి అవసరాలకు సరఫరా చేస్తున్నారు. కాగా ... మిగతా 6వ పేజీలో



సుజల స్రవంతి తొలిదశ పనులకు 2018 నవంబరు 15న చోడవరంలో శంకుస్థాపన చేస్తున్న అప్పటి సీఎం చంద్రబాబునాయుడు (ఫైల్ ఫొటో)



కేంద్రీయ విద్యాలయం పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థిని హాల్ టికెట్ పరిశీలిస్తున్న సిబ్బంది

ప్రశాంతంగా నీట్

- 97.5 శాతం హాజరు

విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి):

వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) ఆదివారం నగరంలో ప్రశాంతంగా ముగిసింది. నగరంలోని 13 కేంద్రాల్లో ఎనిమిది వేల మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 7,800 మంది (97.5 శాతం) హాజరయ్యారు. పరీక్ష రాసేందుకు ఉదయం 11.30 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించారు. అయితే అభ్యర్థులతో పాటు వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు మాత్రం ఎండ తీవ్రతకు గురయ్యారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించేందుకు సిటీ కో-ఆర్డినేటర్ ఈశ్వరీ ప్రభాకర్ పలు కేంద్రాలు తనిఖీ చేశారు.

జన కేతనం

చౌడువాడలో ఉద్రిక్తత

వైసీపీ ప్రచార వాహనాలను అడ్డుకున్న గ్రామస్థులు

- తమ గ్రామ వాసితో పాటు ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌పై బూడి వర్గీయుల దాడికి నిరసన
- రోడ్డుపై బైఠాయింపు
- గ్రామానికి చేరిన సీఆర్పీఎఫ్ దళాలు



వైసీపీ, కూటమి శ్రేణుల తోపులాట

కె.కోటపాడు, మే 5:

వైసీపీ ఎన్నికల ప్రచార వాహనాలను చౌడువాడ గ్రామ పొలిమేరలోనే గ్రామస్థులు ఆదివారం అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. తారువ గ్రామంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వర్గీయులు తమ గ్రామానికి చెందిన వ్యక్తిని కొట్టడంతో పాటు అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌పై దాడి చేయడాన్ని నిరసిస్తూ గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. చౌడువాడ గ్రామంలోకి వైసీపీ ఎన్నికల ప్రచార రథం రాకుండా అడ్డుకున్నారు. తమ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త కుమార అప్పారావును శనివారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు స్వగ్రామం తారువలో వైసీపీ కార్యకర్తలు కొట్టారని, బాధితులను పరామర్శించడానికి వెళ్లిన ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌పై దాడి చేసి పలు వాహనాలను ధ్వంసం చేశారని గ్రామస్థులు ఆరోపించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆదివారం చౌడువాడలో వైసీపీ చేపట్టిన ర్యాలీని ఆ గ్రామస్థులు భగ్నం చేశారు. దీంతో వైసీపీ, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. వైసీపీ ప్రచార వాహనాలను అడ్డుకున్న క్రమంలో పెద్ద ఎత్తున సీఆర్పీఎఫ్ దళాలు గ్రామానికి చేరుకున్నాయి. అనకాపల్లి డీఎస్పీ అప్పలరాజు, చోడవరం, కె.కోటపాడు సీఐలు శ్రీనివాసరావు, స్వామినాయుడు గ్రామస్థులను ఎంత బతిమాలినా గ్రామంలోకి వాహనాలు రావడానికి వీల్లేదని భీష్మించుకు కూర్చున్నారు. చేసేది లేక పోలీసులు వైసీపీ వాహనాలను వెనక్కి పంపించి వేశారు. తమ గ్రామానికి చెందిన కుమార అప్పారావును అకారణంగా కొట్టడంతో బూడి ముత్యాలనాయుడు ప్రచార వాహనాలను గ్రామంలోకి అడుగు పెట్టనివ్వలేదని సర్పంచ్ ఎరుకునాయుడు తెలిపారు.

పోలీసులు మాత్రం ఏ పార్టీకి చెందిన వాహనాలైనా చౌడువాడలోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఎన్నికలు అయ్యేంతవరకు చౌడువాడ గ్రామంలో పోలీస్ పికెట్ ఉంటుందని అధికారులు తెలిపారు.



వైసీపీ ప్రచార వాహనాన్ని వెనక్కి పంపుతున్న కేంద్ర పోలీస్ బలగాలు

సీఎం రమేశ్‌పై దాడి దారుణం

- ఖండించిన కూటమి శ్రేణులు
- పలు చోట్ల బీజేపీ, టీడీపీ, జనసేన నాయకుల నిరసనలు



సీఎం రమేశ్‌పై బూడి వర్గీయుల దాడికి నిరసనగా మాకవరపాలెంలో నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

మాకవరపాలెం/పాయకరావుపేట/గొలుగొండ/కృష్ణాదేవిపేట, మే 5:

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు స్వగ్రామం తారువలో శనివారం బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌పై వైసీపీ నాయకులు దాడి చేయడాన్ని కూటమి శ్రేణులు ఖండించాయి. ఆదివారం పలు చోట్ల బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. మాకవరపాలెంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆర్‌పై పాత్రుడు ఆధ్వర్యంలో కూటమి నాయకులు నిరసన చేపట్టారు. పాయకరావుపేటలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా స్థానిక పాత పంచాయతీ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గొలుగొండ గాంధీ విగ్రహం వద్ద టీడీపీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కృష్ణాదేవిపేటలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు ఆందోళన చేశారు.

సీఐ, ఎస్ఐలను సస్పెండ్ చేయాలి: అయ్యన్న

నర్సీపట్నం: సీఎం రమేశ్‌పై జరిగిన దాడి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన దేవరాపల్లి సీఐ, ఎస్ఐలను జిల్లా ఎస్పీ వెంటనే సస్పెండ్ చేయాలని, లేని పక్షంలో సోమవారం అనకాపల్లి వస్తున్న ప్రధానమంత్రి మోదీ సమక్షంలో ధర్నా చేస్తామని మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు హెచ్చరించారు. ఆదివారం స్థానిక విలేకరులకు వీడియో సందేశం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమి భయంలోనే బూడి ముత్యాలనాయుడు దాడులు చేయించారని ఆరోపించారు. బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ పై దాడులకు పాల్పడిన వైసీపీ నాయకులు, కార్యకర్తలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఓటు కోసం ఉద్యోగులు క్యూ

- పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ ప్రారంభం

విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. చిన్నచిన్న ఘటనలు తప్ప తొలిరోజు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అయితే సాధారణ పోలింగ్‌కు భిన్నంగా పోస్టల్ బ్యాలెట్‌కు ఎక్కువ సమయం పట్టింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు, ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలల్లో ఉద్యోగుల ఓటింగ్‌కు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లుచేసింది. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు వేర్వేరుగా, జిల్లాలో పనిచేస్తూ వేరే జిల్లాలో ఓటు ఉన్న వారి కోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటుచేశారు. ఉద్యోగులకు ఆదివారం నుంచి వరుసగా రెండు రోజులు, ఏడో తేదీ నుంచి రెండు రోజులపాటు పోలీసులకు అవకాశం ఇచ్చారు. తొలిరోజు ఓటు వేసేందుకు ఉదయం 8.30 గంటలకే ఉద్యోగులు ఏయూ హైస్కూలు ప్రాంగణానికి వచ్చేశారు. పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఓటు వేసేందుకు అవకాశం ఇచ్చారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు రెండో విడత ర్యాండమైజేషన్ శిక్షణ ఆదివారం ప్రారంభించారు. ఈ శిక్షణకు హాజరైన ఉద్యోగులు ఓటింగ్ కేంద్రాలకు వచ్చేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. జిల్లాలో ఓటు హక్కు ఉండి ఇక్కడే పనిచేస్తున్న 11,221 మందికిగాను 3152 మంది తొలిరోజు ఆదివారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. విశాఖలో పనిచేస్తూ ఇతర జిల్లాల్లో ఓటు హక్కు ఉన్న 5389 మందిలో 1136 మంది ఓటేశారు.



పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు బారులుతీరిన ఉద్యోగులు

'నిమ్మకట్టు'.. కన్నెత్తి చూస్తే ఒట్టు!

ఐదేళ్లుగా కనీసం పట్టించుకోని జగన్ సర్కారు



పల్లపు కాలువ ప్రధాన గేటు దెబ్బతిన్న దృశ్యం

ఒకప్పుడు ఈ చానల్ ద్వారా 2400 ఎకరాలకు సాగు నీరు

- నేడు ఓ వైపు పూడిక.., మరో వైపు పిచ్చిమొక్కలతో ఆనవాళ్లు మారిన కాలువలు
- చివరి భూములకు నీరందక అన్నదాతలు గగ్గోలు




అభివృద్ధికి నోచుకోని నిమ్మకట్టు చానల్

నాతవరం, మే 5 :

సాగునీటి వనరులపై వైసీపీ సర్కారు నిర్లక్ష్యం పలువురు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. ఒకప్పుడు వ్యవసాయం అంటే ఉత్సాహం చూపే రైతులలో కొందరు నేడు జగన్ పాలనలో ప్రోత్సాహం కరువై పొలంలో పెట్టుబడులు పెట్టాలంటేనే ఒకటికి పదిసార్లు ఆలోచించాల్సిన దుస్థితి దాపురించింది. ఇలా నిర్లక్ష్యానికి గురైన వాటిలో నిమ్మకట్టు చానల్ ఒకటి.

అనకాపల్లి జిల్లాలోని నాతవరం మండలంలో మన్యపురట్ల, ఏపీపురం, రాజుపేటఅగ్రహారం, వీరభూపతి అగ్రహారం, యర్రభూపతి అగ్రహారం, గన్నవరం గ్రామాలతో పాటు, కాకినాడ జిల్లాలో కాకరాపల్లి, అల్లిపూడి, లక్ష్మీపురం గ్రామాలకు ఈ నిమ్మకట్టు చానల్ ద్వారా 2400 ఎకరాలకు సాగునీరు అందుతుంది. తాండవ నది ద్వారా వచ్చే నీటిని రాజుపేట అగ్రహారం గ్రామం వద్ద నిల్వ చేసి, ఇక్కడ ఏర్పాటు చేసిన నిమ్మకట్టు చానల్ ద్వారా మూడు కాలువల నుంచి రైతులకు సాగుకు అందిస్తుంటారు. నిమ్మకట్టు చానల్ పాములవారి కాలువ ద్వారా అల్లిపూడి, లక్ష్మీపురం.., మెరక కాలువ ద్వారా ఏపీపురం, మన్యపురట్ల గ్రామాలకు, పల్లపు కాలువ ద్వారా.. గన్నవరం, కాకరాపల్లి గ్రామాలకు సాగునీరు అందిస్తుంటారు. అయితే నిమ్మకట్టు చానల్ పల్లపు కాలువ ప్రధాన గేటు సగం వరకు దెబ్బతింది. దీంతో ఈ ప్రాంత భూములకు సక్రమంగా నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. అలాగే నిమ్మకట్టు చానల్ పాములవారి కాలువ, మెరక కాలువలలో సిమెంట్ లైనింగ్ పనులు చెయ్యలేదని దీంతో ఈ కాలువలలో పూడికతో పాటు జంగిల్ పెరగడంతో చివరి భూములకు నీరు అందకపోవడమే కాకుండా కాలువల మధ్యలో అక్కడక్కడ మదుముల గేట్లు దెబ్బతిన్నాయని అంటున్నారు. ఫలితంగా కాలువలలో నీరు వృథాగా గెడ్డలలోకి పోతుందని చెపుతున్నారు. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తాండవ ఆధునికీకరణ పనులకు రూ.55 కోట్లు కేటాయించారు. అయితే ఆ నిధులతో తాండవ ఎడమ, కుడి కాలువల సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టిన తాండవ అధికారులు, నిమ్మకట్టు చానల్ మూడు కాలువల సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టకపోవడంతో చివరి భూములకు సరిగా నీరు అందడం లేదని ఆయా పరిధిలోని ఆయకట్టు రైతులు చెపుతున్నారు. జాతీయ జల నిర్వహణ పథకం కింద రూ.40 లక్షలు వెచ్చించి 1994లో అప్పటి మంత్రి ధర్మాన ప్రసాదరావు, అప్పటి ఎమ్మెల్యే రాజాసాగి కృష్ణమూర్తిరాజు శిలాఫలం ఏర్పాటు చేసి, ఆ నిధులతో నిమ్మకట్టు చానల్ మూడు కాలువలను కొంతమేర ఆధునికీకరణ చేశారని, అప్పటి నుంచి ఇప్పటివరకు నిమ్మకట్టు చానల్ అభివృద్ధిని పట్టించుకునేవారు కరువయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. తాండవ అధికారులు మాత్రం నిమ్మకట్టు చానల్ కాలువల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపుతున్నామని చెపుతున్నా, నిధులు మాత్రం మంజూరు కావడం లేదని ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా ఈ నిమ్మకట్టు చానల్‌పై ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా ఆయా పరిధిలోని రైతులు కోరుతున్నారు.



పిచ్చిమొక్కలు పెరగడంతో ఆనవాళ్లు కనిపించని పల్లపు కాలువ

పీఎం పర్యటనతో ట్రాఫిక్ మళ్లింపు

- జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ



అనకాపల్లి రూరల్, మే 5 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం తాళ్లపాలెంలో పర్యటన సందర్భంగా ట్రాఫిక్‌ను మళ్లించినట్టు ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు భారీ వాహనాలు, కంటైనర్లు, టిప్పర్ లారీలు మొదలగు వాహనాలను మళ్లిస్తున్నట్టు చెప్పారు. విశాఖపట్నం నుంచి తుని వైపు వెళ్లే వాహనాలు లంకెలపాలెం జంక్షన్ నుంచి పరవాడ-అచ్యుతాపురం, ఎలమంచిలి-రేగుపాలెం జంక్షన్ మీదుగా తుని చేరుకోవాలన్నారు. తుని నుంచి విజయనగరం, విశాఖపట్నంవైపు వాహనాలు తుని-రేగుపాలెం జంక్షన్, ఎలమంచిలి బైపాస్ -అచ్యుతాపురం-పరవాడ-లంకెలపాలెం జంక్షన్-అసకపల్లి జంక్షన్ మీదుగా విజయనగరం, శ్రీకాకుళం, లంకెలపాలెం నుంచి హైవే మీదుగా విశాఖపట్నం చేరుకోవచ్చన్నారు. సబ్బవరం హైవే మీదుగా వచ్చే వాహనాలు అసకపల్లి- లంకెలపాలెం జంక్షన్ - పరవాడ - అచ్యుతాపురం - ఎలమంచిలి బైపాస్ - రేగుపాలెం జంక్షన్ మీదుగా తుని వెళ్ల వచ్చునన్నారు. చోడవరం నుంచి తుని వైపు వెళ్లే వాహనాలు అనకాపల్లి బ్రిడ్జి, మునగపాక-పూడిమడకరోడ్డు-అచ్యుతాపురం జంక్షన్ - ఎలమంచిలి బైపాస్ జంక్షన్ - రేగుపాలెం జంక్షన్ నుంచి జాతీయ రహదారి మీదుగా తుని వెళ్లవచ్చునన్నారు. ప్రయాణికులు, ప్రజలు ఈ ట్రాఫిక్ మళ్లింపును దృష్టిలో పెట్టుకుని తమ ప్రయాణాలను చేసుకోవాలని ఆయన సూచించారు.

కేకే లైన్‌లో జారిపడిన బండరాళ్లు

- రాయిపైకి ఎక్కి నిలిచిపోయిన గూడ్స్ ఇంజన్
- ఎస్.కోటలో కిరండోల్ పాసింజర్ రైలు నిలిపివేత



బొడ్డవర-శివలింగపురం రైల్వే స్టేషన్ల మధ్య ట్రాక్‌పై జారిపడిన బండరాయిని ఢీకొని ఆగిన గూడ్స్ ఇంజన్

అరకులోయ, మే 5: కొత్తవలస-కిరండోల్ (కేకే) లైన్‌లోని బొడ్డవర-శివలింగపురం రైల్వే స్టేషన్ల మధ్య ట్రాక్‌పై బండరాళ్లు జారిపడ్డాయి. ఆ తరువాత కొద్దిసేపటికే ఆ మార్గంలో వెళ్లిన జంబో గూడ్స్ ఇంజన్ బండరాయిపైకి ఎక్కి ఒక్కసారిగా నిలిచిపోయింది. బొడ్డవర-శివలింగపురం రైల్వే స్టేషన్ల మధ్య 41వ కిలోమీటరు వద్ద ఆదివారం ఉదయం ఆరు గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బండరాయిపైకి ఎక్కిన ఇంజన్ తొలగింపు, ట్రాక్ పునరుద్ధరణ పనులను ఉదయం 11.30 గంటల ప్రాంతంలో పూర్తిచేశారు. విరిగిపోయిన ట్రాక్‌కు సంబంధించిన ఐరన్ కమ్మిని మార్చారు. ఈ కారణంగా విశాఖపట్నం నుంచి కిరండోల్ వెళ్లాల్సిన పాసింజర్ రైలును విజయనగరం జిల్లా ఎస్.కోటలో దాదాపు ఐదు గంటలపాటు నిలిపివేశారు. వాస్తవానికి ఉదయం 11.30 గంటలకు పాసింజర్ రైలు అరకులోయ చేరాల్సి ఉంది. ఎస్.కోటలో గంటల తరబడి పాసింజర్ రైలును నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

జూన్ 9న సీఎంగా చంద్రబాబు ప్రమాణం

- రాష్ట్రంలో కూటమికి 160 సీట్లు ఖాయం
- ఓటమి భయంతోనే ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌పై వైసీపీ దాడి
- మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి చరిత్ర సృష్టించబోతున్నదని, 175 స్థానాలకు 160 గెలుచుకోబోతోందని...జూన్ 9న ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్నారని మాజీ మంత్రి, భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. విశాఖలోని స్వగృహంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమికి రోజురోజుకూ మద్దతు పెరుగుతోందని, రాయలసీమలో వైసీపీ కంచుకోటలు సైతం బద్ధలు కానున్నాయన్నారు. ఉత్తరాంధ్రాలో మొత్తం 34 అసెంబ్లీ స్థానాలు ఉండగా కూటమి 30కి పైగా గెలుచుకుంటుందని ధీమా వ్యక్తంచేశారు. కూటమి 'ప్రజాగళం' పేరుతో ప్రకటించిన మేనిఫెస్టోకు అన్నివర్గాల నుంచి విశేషమైన స్పందన కనిపిస్తున్నదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాత పథకాలతోనే వైసీపీ మేనిఫెస్టోను ప్రకటించడంతో ప్రజల్లో స్పందన కరువైందన్నారు. కూటమి ప్రకటించిన పథకాల అమలుకు డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారని జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించడాన్ని గంటా తప్పుబట్టారు. సంపద సృష్టించడం, సంక్షేమాన్ని అందించడం చంద్రబాబుకు ఎప్పటి నుంచో అలవాటని గుర్తుచేశారు. జగన్ మోహన్ రెడ్డి నిక్కర్లు వేసుకునే వయసులోనే తెలుగుదేశం పార్టీ అధినేత ఎన్‌టీఆర్ రెండు రూపాయలకు కిలో బియ్యం, పక్కా ఇళ్ల నిర్మాణం, పెన్షన్ వంటి పథకాలతో ఆంధ్ర రాష్ట్రానికి సంక్షేమం ఏమిటో చూపించాన్నారు. మాడుగుల మండలం తారువలో దాడికి గురైన బీజేపీ కార్యకర్తను పరామర్శించడానికి అనకాపల్లి కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అక్కడికి వెళితే డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న బూడి ముత్యాలనాయుడు తన అనుచరులతో దాడి చేయించడం దారుణమన్నారు. దీనిని ఖండిస్తున్నామన్నారు. తన పాతికేళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి సంస్కృతి చూడలేదన్నారు. ఓటమి భయంతోనే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో బీజేపీ భీమిలి ఇన్‌చార్జి రామునాయుడు, జనసేన నాయకుడు ఎస్.శ్రీనివాస్, టీడీపీ భీమిలి ఇన్‌చార్జి కోరాడ రాజబాబు పాల్గొన్నారు.

జనం బటన్ నొక్కితే.. జగన్‌కు జ్వరం రావాలి

- కూటమి కార్యకర్తలకు అన్యాయం జరిగితే దేశంలో ఏ మూల ఉన్నా వస్తా..
- బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్
- రాష్ట్ర అభ్యున్నతే కూటమి పార్టీల ధ్యేయం : సుందరపు



లైనుకొత్తూరులో మాట్లాడుతున్న జనసేన అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్



ఎలమంచిలిలో జరిగిన తూర్పుకాపుల ఆత్మీయ సమావేశంలో నమూనా బ్యాలెట్ చూపుతున్న ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్

ఎలమంచిలి, మే 5: రానున్న ఎన్నికల్లో జనం కూటమి అభ్యర్థుల గుర్తులపై బటన్ నొక్కితే జగన్‌కు జ్వరం రావాలని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కల్యాణ మండపంలో తూర్పుకాపుల ఆత్మీయ సమావేశానికి సీఎం.రమేశ్, జనసేన అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం వస్తుందంటే అందుకు కారణం పవన్ కల్యాణ్ అని అన్నారు. హీరో చిరంజీవి ప్రోత్సాహంతో నరేంద్ర మోదీ ఆశీర్వాదంతో అనకాపల్లి వచ్చానన్నారు. తారువా ఘటనపై మాట్లాడుతూ ఒక కార్యకర్తను కొడితే ఊరుకునేది లేదని, పార్లమెంటు అభ్యర్థిగా నా దృష్టికి ఈ విషయం వెళ్లి పరామర్శించి, వారికి న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత నాపై ఉందన్నారు. ఎక్కడైనా కూటమి కార్యకర్తలకు అన్యాయం జరిగితే భారతదేశంలో ఎక్కడ ఉన్నా వస్తానన్నారు. శనివారం జరిగిన ఘటనపై ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. పిఠాపురంలో పవన్ కల్యాణ్ పోటీ చేస్తున్నారని, మన బంధువులు అందరికీ చెప్పి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పిఠాపురం వెళ్లి కొంతమంది పవన్ కల్యాణ్‌కు మద్దతు తెలపనున్నారని, నేను ఇప్పుడే పేరు చెప్పడం బాగుండదని అనడంతో పెద్ద ఎత్తున యువత హర్షధ్వానాలు చేశారు. ప్రధాని మోదీ అనకాపల్లి పర్యటనకు వస్తున్నారన్నారని, ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. మరో ఐదు రోజులు కష్టపడండి.. కూటమి అభ్యర్థులను గెలిపించండి అంటూ నమూనా ఈవీఎంను చూపించారు. అనంతరం జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ కూటమి అభ్యర్థుల విజయమే అందరి ధ్యేయమని పిలుపునిచ్చారు. అనంతరం తూర్పుకాపుల ప్రతినిధులు శ్రీహరి, అప్పారావు మాస్టారు, సన్యాసిరావు, కొఠారు సాంబ, కొఠారు సరేష్, నక్కా శివశంకర్, తదితరులంతా సీఎం రమేశ్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం లైనుకొత్తూరులోని ప్రైవేటు కల్యాణ మండపంలో నిర్వహించిన కాపుల ఆత్మీయ సమావేశానికి జనసేన అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పులపర్తి గ్రామానికి యువకులు భాస్కర్, తదితరులు సుందరపును అభినందించారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు కాండ్రకోట చిరంజీవి, పిట్లా శ్రీనివాస్, కొలుకులూరి విజయ్‌బాబు, బొద్దపు శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, లవుడు లోవరాజు, రాజాన నారాయణమ్మ, పోలిశెట్టి కృపారావు, బుల్లిబాబు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే సీఎం రమేశ్‌పై దాడి

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్

కొత్తూరు(అనకాపల్లి), మే 5: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఓటమి భయంతోనే కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌పై దాడికి పాల్పడ్డారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్ ఆరోపించారు. ఆదివారం బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. దేవరాపల్లి మండలం తారువలో శనివారం జరిగిన దాడిని ఆయన ఖండించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తారువ గ్రామంలో బీజేపీ నాయకులు డ్రోన్‌తో బీజేపీ జెండా ఎగురవేయడంతో సహించలేని బూడి ముత్యాలనాయుడు తన రౌడీమూకతో బీజేపీ నాయకుల ఇంటికి వెళ్లి విచక్షణరహితంగా దాడి చేసి చంపే ప్రయత్నం చేశారన్నారు. ఈ సంఘటనపై పోలీసు స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయగా.. తూతూ మంత్రంగా సాధారణ సెక్షన్‌లతో కేసులు నమోదు చేశారన్నారు. ఈ విషయాన్ని ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు తెలియజేయగా హుటాహుటీన పోలీసు స్టేషన్‌కు వెళ్లి బాధితులను పరామర్శించి, అండగా నిలిచారని తెలిపారు. దీనిని సహించని బూడి ముత్యాలనాయుడు గంజాయి, ఇసుక మాఫియా గ్యాంగ్‌లతో సీఎం రమేశ్‌పై దాడి చేయించారన్నారు. ఎన్నికల్లో బూడి ముత్యాలనాయుడు ఓటమి ఖరారు కావడంతో ఇటువంటి దాడులకు పాల్పడ్డారన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం అయితే చూస్తూ ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. అనంతరం జనసేన పార్టీ చోడవరం ఇన్‌చార్జి పీవీఎస్.ఎన్ రాజు మాట్లాడుతూ.. అన్ని ప్రాంతాల్లో డ్రోన్‌లకు బీజేపీ జెండాను ఎగురవేస్తున్నామని, వాటికి ఎటువంటి కెమెరాలు ఉండవన్నారు. ఇటువంటి దాడులకు బెదిరేది లేదని, సీఎం రమేశ్‌కు తామంతా అండగా ఉంటామని తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ.. సీఎం రమేశ్‌పై దాడిని ఖండిస్తున్నామన్నారు. డిప్యూటీ సీఎం హోదాలో బూడి ముత్యాలనాయుడు ఈ ప్రాంతానికి అభివృద్ధి చేసేదేమీ లేదన్నారు. వ్యవసాయ పంటపొలాల్లో పురుగుల మందు పిచికారీ చేసే డ్రోన్‌కు జెండాలు ఎగురవేస్తున్నామన్నారు.

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు

- జాతర ఆఖరి ఆదివారం కావడంతో భారీగా తరలివచ్చిన భక్తజనం



బాలాలయంలో అమ్మవారికి భక్తుల పూజలు



అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

అనకాపల్లి టౌన్, మే 5: ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతిగాంచిన నూకాంబిక అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కొత్త అమావాస్య జాతర ప్రారంభమైన ఆఖరి ఆదివారం కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచి భక్తుల రాకతో ఆలయానికి వచ్చే మార్గాలన్నీ రద్దీగా మారాయి. తెల్లవారుజామున ఆరు గంటలకు ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించిన తరువాత భక్తులకు దర్శనం కల్పించారు. క్యూలైన్లు అన్ని భక్తులతో నిండిపోయాయి. దీంతో రోడ్డుపై కూడా భక్తులు క్యూ కట్టి గంటల తరబడి వేచి ఉండి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలోని కాటేజీల్లోనే కాకుండా పరిసర ప్రాంతాల్లోని కొబ్బరితోటల్లో భక్తులు కుటుంబసమేతంగా చెట్ల నీడన వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యం పెట్టి సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు చల్లటి మంచినీటిని ఆలయ సిబ్బంది అందజేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించగా ఆలయానికి వచ్చే మార్గాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ సీఐ పి. పైడపునాయుడు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలు దాటినా ఆలయ ఆవరణలో భక్తుల తాకిడి తగ్గలేదు.

క్రైం... crime news

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



గుర్తు తెలియని మృతదేహం

పరవాడ, మే 5 : ఎండ వేడికి తాళలేక గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి సీఐ బాలసూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎలమంచిలి-గాజువాక ప్రధాన రహదారిలోని గొర్లివానిపాలెం వద్ద ఆదివారం గుర్తు తెలియని వృద్ధుడు రహదారి పక్కన ఎండ వేడికి తట్టుకోలేక అపస్మారక స్థితి పడి ఉన్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే వృద్ధుడిని 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వృద్ధుడు మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చ్యురీలో భద్రపరిచారు. మృతుని సంబంధికులు ఎవరైనా ఉంటే పరవాడ పోలీస్‌స్టేషన్‌కు సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

ఎలమంచిలి, మే 5: మండలంలోని షేకిళ్లపాలెం సమీపంలో లైటింగ్ సామగ్రి తరలిస్తున్న బొలెరో వాహనం పైనుంచి పడిపోయి యువకుడు మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ సింహాచలం ఆదివారం తెలిపారు. ఈ ప్రమాదంలో కోటకోట మండలం వెదురుపర్తి గ్రామానికి చెందిన గూడుపు సతీష్(17) మృతి చెందినట్టు గుర్తించామన్నారు. శనివారం లైటింగ్ సామాన్లు తరలించే వాహనంలో సతీష్ కట్టుపాలెం ఫంక్షన్‌కు తీసుకువెళుతుండగా పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయని, అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతుడు ఇటీవల వెదురుపర్తి స్కూలులో పదవ తరగతి పరీక్షలు రాసి పాసైనట్లు తెలిసింది.

బైక్, వ్యాన్ ఢీ : ఇద్దరికి గాయాలు

నర్సీపట్నం అర్బన్, మే 5 : ఎదురెదురుగా ప్రయాణిస్తున్న బైక్, వ్యాన్ ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయని నర్సీపట్నం రూరల్ ఎస్ఐ భీమరాజు తెలిపారు. నర్సీపట్నం నుంచి తంగేడు వెళుతున్న బైక్‌ను ధర్మసాగరం గ్రామ జంక్షన్ వద్ద నర్సీపట్నం వస్తున్న వ్యాన్ శనివారం కొట్టాయన్నారు. స్థానికుల అందించిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. బైక్‌పై ప్రయాణిస్తున్న గుడివాడ రమణ, అతని మనమరాలకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. వ్యాన్ డ్రైవర్ పరారీలోవున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

సెల్‌ఫోన్ పేలి ఒకరికి తీవ్ర గాయాలు

పెదబయలు, మే 5 : జేబులో ఉంచిన సెల్‌ఫోన్ పేలి ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు, వైద్యులు తెలిపిన వివరాలివి. బొంగరం పంచాయతీ పరమలమ్మ గ్రామానికి చెందిన జడ్డి పెద్దబ్బాయి అనే వ్యక్తి తన సెల్ ఫోన్‌ను శనివారం జేబులో ఉంచుకున్నాడు. అది ఒక్కసారిగా పేలిపోవడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. వెంటనే అతనికి గోమంగి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్సలు అందించిన అనంతరం మెరుగైన వైద్య సేవల నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

22 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, మే 5 : మండలంలోని తాడి బీసీ కాలనీకి చెందిన ముమ్మిన నాగఅప్పారావు ఆదివారం రాత్రి ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి పది క్వార్టర్ మద్యం సీసాలు కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా పట్టుకున్నట్టు సీఐ బాలసూర్యారావు తెలిపారు. అతని వద్ద మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అలాగే గొర్లివానిపాలెం జేఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీకి చెందిన పాలేటి నవీన్ ఆదివారం రాత్రి స్థానిక ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 12 క్వార్టర్ మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా పట్టుకున్నట్టు చెప్పారు. నిందితుల ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

నేటి నుంచి చింతపల్లిలో ముత్యాలమ్మ సంబరం



చింతపల్లి, మే 5 : మన్యం ప్రజల ఆరాధ్య దేవత ముత్యాలమ్మ సంబరం చింతపల్లిలో సోమవారం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పసుపులేటి వినాయకరావు, పెదిరెడ్ల బేతాళుడు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఈ ఏడాది అమ్మవారి జాతర నిర్వహించే పరిస్థితి లేదన్నారు. ఈ మేరకు అమ్మవారి సంబరం సోమవారం నుంచి బుధవారం వరకు జరపాలని నిర్ణయించినట్టు చెప్పారు. తొలిరోజు సాయంత్రం అమ్మవారి గరగలు (పాదాలు)ను సుర్లవారి వంశీయుల స్థావరాల నుంచి శతకంపట్టు వద్దకు తీసు కొస్తామన్నారు. గరగలకు ఇక్కడ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మంగళవారం సాయంత్రం నుంచి చింతపల్లి పురవీధుల్లో బుధవారం ఉదయం ఆరుగంటల ఊరేగిస్తామన్నారు. అనంతరం వాటిని ఆలయానికి తీసుకొస్తామని, అదే రోజు మధ్యాహ్నం అనుపోత్సవం జరుపుతామని వివరించారు. ఇందులో భాగంగా గిరిజన సాంప్రదాయ నృత్య ప్రదర్శనలతో గరగలను ఊరేగించి సాయంత్రం సుర్ల వంశీ యుల స్థావరాలకు తరలించి సంబరాన్ని ముగిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు సుర్ల వీరేంద్ర, గసాడి పద్మనాభం, కుడుముల వెంకటరమణ, యూవీ గిరి, దేపూరి శశి కుమార్, బౌడు గంగరాజు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏయూ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష

విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్ష (ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్)కు 90.87 శాతం హాజరైనట్టు అడ్మిషన్స్ సంచాలకులు ప్రొఫెసర్ డీఏ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు 4,349 మంది దరఖాస్తు చేయగా 3952 మంది హాజరైనట్టు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కడపలోని ఎనిమిది ప్రాంతీయ కేంద్రాల పరిధిలో ఈ పరీక్షను నిర్వహించారు. ఈ నెల ఏడో తేదీన ఫలితాలు విడుదల కానున్నాయి.

రెండో రోజు 45 కిలోల చందనం అరగదీత

సింహాచలం, మే 5: వరాహలక్ష్మీనృసింహస్వామికి పైపూతగా సమర్పించనున్న శ్రీచందనాన్ని రెండో రోజు 45 కిలోలు అరగదీశారు. ఆదివారం ఉదయం సుప్రభాత సేవల అనంతరం నాలుగో తరగతి సిబ్బంది చందనం అరగదీతను ప్రారంభించి, మధ్యాహ్నం 11.30 గంటలకు ముగించారు. అరగదీసిన శ్రీచందనం ముద్దను దేవాలయ స్థానాచార్యులు రాజగోపాల్ తూనిక వేసి ఆలయ పద్మనిధిలో భద్రపరిచారు. రెండు రోజుల్లో ఇప్పటి వరకు 80 కిలోల చందనాన్ని అరగదీశారు.

దువ్వాడ మీదుగా సంబల్‌పూర్, కాచీగూడ మధ్య రైలు

విశాఖపట్నం, మే 5: వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం వయా దువ్వాడ మీదుగా సంబల్‌పూర్, కాచీగూడ మధ్య ప్రత్యేక రైళ్ల సర్వీసులను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. 08323 నంబరు గల రైలు ఈనెల 13 నుంచి జూన్ 24 వరకు ప్రతి సోమవారం రాత్రి 9.00 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 7.20 గంటలకు దువ్వాడ, రాత్రి 9.50 గంటలకు కాచీగూడ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 14 నుంచి జూన్ 25 వరకు ప్రతి మంగళవారం రాత్రి 11.20 గంటలకు కాచీగూడలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 12.30 గంటలకు దువ్వాడ, రాత్రి 11.45 గంటలకు సంబల్‌పూర్ చేరుతుంది.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	470
విజయనగరం	474
శ్రీకాకుళం	474




ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్

ఆస్తి మీదే... హక్కులు ఎవరివైనా కావచ్చు


భూమి హక్కుదారులకు అనేక రకాల ఇబ్బందులు

- తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని టీడీపీ, జనసేన ప్రకటన
- డిఫెన్స్‌లో పడిన వైసీపీ ప్రభుత్వం
- ఈ నిర్ణయాన్ని ఎప్పటి నుంచో వ్యతిరేకిస్తున్న న్యాయవాదులు



విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్...ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా వినిపిస్తున్న పదం. ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్న చట్టం. వైసీపీ ప్రభుత్వం అమలు చేయాలని భావిస్తున్న ఈ భూ యాజమాన్య హక్కు చట్టాన్ని (ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్-2024) అన్నివర్గాల ప్రజలు తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. అసలు ఈ చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించినప్పుడే న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తంచేశారు. వేర్వేరు రూపాల్లో తమ నిరసన తెలియజేశారు. ఈ యాక్ట్ అమలులోకి వస్తే అనేక రకాల ఇబ్బందులు ఉంటాయని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రజల స్థిరాస్తులపై చట్టబద్ధమైన హక్కులను ప్రభుత్వం నియమించే వ్యక్తుల చేతిలో పెట్టే అవకాశాన్ని ఈ యాక్ట్ కల్పిస్తోందన్న భావనను వ్యక్తపరుస్తున్నారు. దీనివల్ల స్థిరాస్తులు, వివాదాస్పద భూములు, స్థలాలకు సంబంధించిన వ్యవహారాల్లో రాజకీయ జోక్యానికి ఆస్కారాన్ని కల్పించినట్టు అవుతుందని, తద్వారా అధికారంలో ఉన్న పార్టీ నేతలు చెప్పిన వారికి మేలు జరిగేందుకు అవకాశం ఏర్పడుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఈ యాక్టును వైసీపీ ప్రభుత్వం సమర్థించుకుంటుండగా, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని తెలుగుదేశం, జనసేన పార్టీల అధినేతలు ప్రకటించారు. ఈ యాక్ట్‌పై న్యాయవాదులు ఏమంటున్నారో చూద్దాం...

ఆస్తి యజమానులకు నష్టాన్ని చేకూర్చే నిర్ణయం



ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈ యాక్ట్ అమలులోకి వస్తే ప్రభుత్వం నియమించే వ్యక్తుల ఆధ్వర్యంలో సమస్యలను క్లియర్ చేస్తామని చెబుతున్నారు. దీనివల్ల రాజకీయ జోక్యానికి, లంచాలకు, అవినీతికి ఆస్కారం ఏర్పడుతుంది. న్యాయ అవ గాహన లేని వారితో ఇబ్బందులు ఎక్కువ అవుతాయి. ఎకరా, అర ఎకరా భూములు ఉన్న సాధారణ రైతులకు ఈ యాక్ట్‌తో పెను ప్రమాదమే. జిల్లా కోర్టులో, ట్రిబ్యునల్స్‌లో అప్పీల్ చేయడానికి అవకాశం ఉండదు. అలాగే రైతు తన భూమిని మరొకరు వివాదంలోకి లాగిన విషయాన్ని రెండేళ్లలో తెలుసుకోలేకపోతే పెద్ద నష్టమే కలుగుతుంది. రిజిస్ట్రేషన్లను ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాలకు అప్పగించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జనరల్ లిమిటేషన్ యాక్ట్, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్‌కు పూర్తి విరుద్ధం. ఇందులో ఎన్ని సెక్షన్లు నిలబడతాయో కూడా చెప్పలేం. ఈ యాక్ట్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. ఇది ఆస్తి యజమానులకు నష్టాన్ని చేకూర్చే నిర్ణయం.

- కేవీ రామమూర్తి, న్యాయవాది, విశాఖపట్నం

కబ్జాదారుల చేతుల్లో భూములు పెట్టే యాక్ట్



ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా చేసే చట్టం ఇది. ఈ యాక్ట్ అమలులోకి వస్తే సాధారణ ప్రజల ఆస్తులకు ఇబ్బందులు తప్పవు. రెవెన్యూలో అవినీతిని ప్రోత్సహించేందుకు ఈ యాక్ట్ దోహదం చేస్తుంది. ఉదాహరణకు రెండు ఎకరాల భూ యజమాని ఇతర ప్రాంతాల్లో ఉద్యోగం చేసుకుంటూ ఉంటాడు. ఐదేళ్లకో, పదేళ్లకో ఊరు వస్తుంటాడు. అతని భూమిని ఎవరైనా కబ్జా చేసి తన పేరు మీద టైటిల్ రాయించుకున్నాడనుకోండి. ఈ విషయం ఎక్కడో ఉన్న యజమానికి రెండేళ్ల వరకు తెలియకపోతే...దానిపై అతను హక్కును కోల్పోయే ప్రమాదముంది. ఈ తరహా ఇబ్బందులు పరిష్కారానికి ఇప్పటివరకు కింది స్థాయి కోర్టులకు వెళ్లేఅవకాశం లభించేది. ఇప్పుడు ఆ అవకాశమే లేదు. నేరుగా హైకోర్టుకు మాత్రమే వెళ్లాలి. పూర్తి అధికారాలను టైటిలింగ్ ఆఫీసర్ చేతిలో పెట్టడం వల్ల అవినీతిని ప్రోత్సహించే అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే కబ్జాదారుల చేతుల్లోకి భూములను తీసుకువెళ్లి పెట్టేందుకు మార్గాన్ని యాక్ట్ ద్వారా కల్పిస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరమైన చట్టం.

- జీవీఏ సాయిబాబా, న్యాయవాది, విశాఖపట్నం

న్యాయాన్ని నిరుపేదలకు దూరం చేసే యాక్ట్

భూ సంబంధిత సమస్యల్లో న్యాయాన్ని నిరుపేదలకు దూరం చేసేలా ఈ యాక్ట్ చేస్తోంది. ఇప్పటివరకు భూములకు సంబంధించిన వివాదాలపై తీర్పులను సీనియర్లు అయిన న్యాయవాదులు ఇస్తున్నారు. వీరికి ఎంతో అనుభవం, ఎంతో శిక్షణ ఉంటాయి. తాజాగా తెచ్చిన యాక్ట్ వల్ల ప్రభుత్వం నియమించిన వ్యక్తులకు అధికారాన్ని కట్టబెట్టడం వల్ల రాజకీయ ప్రమేయాన్ని పెంచేందుకు అవకాశం ఉంది. యాజమాన్య హక్కులను నిర్ణయించే అధికారాన్ని ప్రభుత్వం నియమించే వ్యక్తులకు కట్టబెట్టడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయి. కొన్ని చోట్ల కావాలనే వివాదాలు సృష్టించే వ్యక్తులు ఉంటారు. దీనివల్ల అవసరార్థం ఆస్తులను అమ్ముకునే వారికి ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ చట్టంతో ప్రజల ఆస్తులకు రక్షణ కొరవడే ప్రమాదం ఉంది.



- నాదెండ్ల వెంకట సుమన్, సీనియర్ న్యాయవాది, విశాఖ బార్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్

భూ యజమానులను ఇబ్బందులకు గురి చేసే చట్టం



ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ భూ యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. దీనివల్ల భూ యజమానుల నష్టపోయే ప్రమాదం ఉంది. వివాదాలను క్లియర్ చేయించుకోవడానికి లంచాలు ఇవ్వాల్సి రావచ్చు. కొన్నిసార్లు రాజకీయ నాయకుల ప్రమేయంతో అసలు యజమానులకు బదులు.. ఎవరికైనా వాటిపైనా హక్కులు దక్కే ప్రమాదం ఉంది. ఉన్నత స్థానంలో అప్పీల్ చేసుకోవడానికి రెండేళ్లకు పైగా సమయం పడుతుంది. అత్యవసర సమయాల్లో ఆస్తులు అమ్మడానికి అవకాశం ఉండదు. క్లియరెన్స్ సర్టిఫికెట్ కోసం టైటిలింగ్ పర్సన్ చుట్టూ తిరగాల్సి రావచ్చు. న్యాయ పరిజ్ఞానం లేని వ్యక్తులకు టైటిలింగ్ పర్సన్ అధికారాలు ఇస్తే మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోవడం ద్వారా మాత్రమే ప్రజలకు మేలు కలుగుతుంది.

- డి.నరేష్ కుమార్, ప్రముఖ న్యాయవాది, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ

సామాన్యుల భూములకు రక్షణ కరవు



ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనేది చాలా ప్రమాదకరమైన చట్టం. ఈ చట్టం అమల్లోకి వస్తే పేదల భూములకు రక్షణ లేకుండా పోతుంది. డబ్బు, పలుకుబడి ఉన్నవారికే ఈ చట్టం ఉపయోగపడుతుంది. పేదలు తమ భూములను కాపాడుకోవడం తలకు మించిన భారమే. అయాక్టు అంత ప్రమాదకరంగా ఉండడం వల్లే, దీనికి వ్యతిరేకంగా న్యాయవాదులందరూ ఏకతాటిపైకి వచ్చి వ్యతిరేకంగా పోరాటం చేశాం. ఇప్పటికీ పోరాటం చేస్తున్నాం. ఈ చట్టం వల్ల భూములకు పూర్తి రక్షణ కలుగుతుందని వైసీపీ ప్రభుత్వం చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం. ఈ చట్టం వల్ల మేలు కంటే కీడే ఎక్కువ. ఈ చట్టాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలి. **- గూనూరు లక్ష్మీనారాయణ**, న్యాయవాది, చోడవరం

దుర్మార్గమైన చట్టం



వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వల్ల ప్రజల ఆస్తులకు భద్రత కరవవుతుంది. ఆ యాక్టును అనుసరించి ఇప్పటికే రాష్ట్రంలో అనేక అవకతవకలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రైతులకు నష్టం కలిగించే విధంగా రీ సర్వే పేరుతో పెద్దఎత్తున దోపిడీ జరుగుతుంది. రైతాంగం వారికి జరిగిన అన్యాయం గురించి ఎవరికి చెప్పుకోవాలో తెలియని మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ చట్టం పూర్తిస్థాయిలో అమలు జరిగితే తీవ్రంగా నష్టపోయేది చిన్న, సన్నకారు రైతులే. వారి హక్కును నిర్ధారించుకునేలోపే రికార్డు రూపంగా మరొకరికి ఆస్తి బదిలీ అయిపోతుంది. ఇది దుర్మార్గమైన చట్టం. ఈ చట్టాన్ని రద్దు చేయాలి. **- ఇల్లా అవినాష్**, న్యాయవాది, అనకాపల్లి

చిన్న, సన్నకారు రైతులకు ఇబ్బంది



ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వ్ల చిన్న, సన్నకారు రైతులు ఇబ్బంది పడతారు. ఏదైనా భూ సమస్య వస్తే ల్యాండ్ టైటిలింగ్ అధికారి వద్దకు వెళ్లాలి తప్పితే కోర్టుకు వెళ్లడానికి వీలు లేదు. అడంగల్, 1-బి రికార్డులు ఉండవు. టైటిల్ ఒక్కటే ఉంటుంది. అత్యవసరంగా భూములు అమ్ముకోవాలన్నా, తనఖా పెట్టాలన్నా అధికారులు అనుమతి తీసుకోవల్సి ఉంటుంది.

-కామిరెడ్డి సత్యనారాయణ, సీనియర్ న్యాయవాది, నర్సీపట్నం

యాక్ట్ వల్ల కలిగే నష్టాలపై పుస్తకం రాశా



ఈ యాక్ట్ వల్ల తీవ్ర నష్టం కలుగుతుంది. పూర్తిగా సివిల్ కోర్టులకు వెళ్లడానికి లేకుండా చేశారు. ల్యాండ్ టైటిలింగ్ అథారిటీ వద్దే ప్రతి సమస్య పరిష్కరించుకోవాలి. మూడు రకాల రిజిస్టర్లు టైటిలింగ్ ఆఫీసర్ దగ్గరే ఉంటాయి. అందులో ఒకటి వివాద రిజిస్టర్ ఉంటుంది. అక్కడే తేల్చుకోవాల్సి ఉంటుంది. వివాదం అంటే ఏమిటో, టైటిల్ అంటే ఏమిటో చెప్పలేదు. అగ్రిమెంట్‌లు అంటే ఏమిటో స్పష్టత లేదు. ఈ యాక్ట్ వల్ల జరిగే నష్టాలు ఏమిటో ప్రజలకు తెలియజేసేం దుకు నా భూమి, నా హక్కు, నా ఇష్టం పేరుతో పుస్తకాన్ని కూడా రాశాను.

- పతివాడ గిరిధర్, న్యాయవాది, విశాఖపట్నం

ఓటరు మాట

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలి



రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విభజన హామీలు అమలుపై స్పష్టమైన హామీలు ఇచ్చే పార్టీకే ఓటు వేయాలి. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, విశాఖ రైల్వే జోన్, ఓపీఎస్ పునరుద్ధరణ, ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చే అభ్యర్థులను గెలిపించాలి. హామీలను సమర్థంగా అమలుచేయ గల సత్తా నేతలను ఎన్నుకుంటేనే భవిష్యత్తు. పథకాల పేరుతో జనాన్ని సోమరులుగా మార్చే వారిని తరిమికొట్టాలి. ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి ఓటువేయాలి.

- మామిడి ఉపేంద్ర, గాజువాక

పరిశ్రమలను ప్రోత్సహించాలి



రాష్ట్రంలో చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా నిరుద్యోగ సమస్య తీరుతుంది. పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసినట్టు అవుతుంది. స్వయం ఉపాధి పథకాల్లో భాగంగా యువత చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి మరింతమందికి ఉపాధి కల్పిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పరిశ్రమల ఏర్పాటుతో వలసలు తగ్గుతాయి. ఈ తరహా ఆలోచనలున్న పార్టీలు, నేతలను ఎన్నుకుంటే రాష్ట్రం ఆర్థికంగా బలోపేతమవుతుంది.

- అర్జిల్లి దాసు, ఎంవీపీ కాలనీ

మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుం టున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243

సామాజిక మాధ్యమం హోరెత్తుతున్న ప్రచారం

ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలు వినియోగం

- ప్రత్యేకంగా బృందాలను నియమించుకున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు.. భారీగా ఖర్చు
- వేలాది గ్రూపులు... లక్షలాది కాంటాక్టులు
- నిత్యం వందల్లో పోస్టింగ్‌లు
- ఏ విషయమైనా నిమిషాల్లో అప్‌లోడ్
- చర్చలు, లైక్‌లు, విమర్శలకు అదే వేదిక
- పెరిగిన ఆకర్షణ... తగ్గిన విశ్వసనీయత

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ప్రచారానికి ఒకప్పుడు పార్టీ జెండాలు, బ్యానర్లు, బ్యాడ్జీలు, కరపత్రాలు, ప్రచార రథాలే ఆధారం. ఇందుకోసం రూ.లక్షల్లో ఖర్చు చేసేవారు. కాలంతోపాటు ట్రెండ్ మారింది. సామాజిక మాధ్యమాలు వచ్చాక ఇప్పుడు ఓటర్లను ఆకట్టుకునేందుకు టెక్నాలజీయే ముఖ్యమైంది. ప్రస్తుతం ప్రధాన పార్టీలు ఒకవైపు సంప్రదాయ రీతిలో...మరోవైపు సామాజిక మాధ్యమాల వేదికగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. ఓటరుకు ఎందులో ఖాతా ఉన్నా విడిచిపెట్టడం లేదు. ట్విటర్ (ఎక్స్) మొదలు ఫేస్‌బుక్, ఇన్‌స్టా, టెలీగ్రామ్, వాట్సాప్...ఇలా ఏ అకౌంట్ ఉన్నా అందులో మెసేజ్‌ల మోత మోగుతోంది. గత ఎన్నికల్లో అంతంత మాత్రంగా ఉన్న సామాజిక మాధ్యమాల ప్రభావం ఇప్పుడు పతాక స్థాయికి చేరింది. ఇందుకు కారణం మారుమూల పల్లెల్లోనూ స్మార్ట్ ఫోన్లు పెరగడమే.



ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్

నూటికి 95 శాతం మంది చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంది. టచ్ స్క్రీన్ ఫోన్లలోనే కాకుండా బేసిక్ మోడళ్లలోనూ వాట్సాప్, ఫేస్‌బుక్ ఫీచర్లు అందుబాటులోకి వచ్చాక ప్రతి ఒక్కరికీ ఈ అకౌంట్లు సాధారణంగా మారాయి. ఇంగ్లీషు రాని వాళ్లు సైతం వీటిని ఆపరేట్ చేస్తున్నారు. వీటికితోడు ఇంటర్నెట్ వినియోగం పెరగడంతో సామాజిక మాధ్యమాలు వీక్షించే వారి సంఖ్య భారీగా ఉంది. దీనిని రాజకీయ పార్టీల అభ్యర్థులు వినియోగించుకుంటున్నారు. తమ నియోజకవర్గాల పరిధిలోని ఓటర్ల ఫోన్ నంబర్లు, ఇతర సామాజిక మాధ్యమాల అకౌంట్లను తెలుసుకుని...వారికి తాము చెప్పాలనుకుంటున్న విషయాన్ని చేరవేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా గ్రూపులు, కమ్యూనిటీలు ఏర్పాటు చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారాన్ని విభిన్నంగా నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలను కూడా నియమించుకుంటున్నారు. ఈ బృందాలు సదరు అభ్యర్థులకు సంబంధించిన బలాబలాలు, చేసిన మంచి, అభివృద్ధి వంటి అంశాలతో కూడిన పాయింట్లు, విజువల్స్‌తో కూడిన వీడియోలు రూపొందించి పోస్ట్ చేస్తున్నాయి.

వేలాది కాంటాక్ట్‌లు

ఒక్కొక్కరూ వేలాది కాంటాక్ట్‌లతో అనుసంధానమై ఉంటున్నారు. ఇది ప్రచారానికి ఎంతో ఉపయుక్తమవుతోంది. ఉదయం నెట్ ఆన్ చేయగానే వందల్లో, వేలల్లో పొలిటికల్ మెసేజ్‌లు చక్కర్లు కొడుతున్నాయి. ప్రధానంగా పార్టీల్లో యాక్టివ్‌గా ఉన్న కార్యకర్తలు వాట్సాప్ గ్రూపులు క్రియేట్ చేస్తూ ప్రచారాలను, తమ బలాలను, ప్రత్యర్థుల బలహీనతలను వాటిలో పోస్ట్ చేస్తున్నారు. ఇక ఫేస్‌బుక్‌లో, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, టెలీగ్రామ్‌లలో ఫాలోవర్స్ అధికంగా ఉన్న నాయకులు వాటి వేదికగా అప్ టు డేట్ సమాచారాన్ని అప్‌లోడ్ చేస్తున్నారు. కార్యకర్తల సమావేశాలు, ఒకరిపై మరొకరి ఫిర్యాదులు, ఆరోపణలు, ప్రచారాలు క్షణాల్లో ఫొటోలతో సహా అప్‌లోడ్ చేస్తున్నారు. వాట్సాప్‌లలో సుమారు 5 వేల మంది ఒక గ్రూపుగా చేర్చుకునే వీలుంది. ఒక కార్యకర్త వద్ద అన్ని కాంటాక్టులతో ఒక గ్రూపును క్రియేట్ చేసి దాని ద్వారా అన్ని విషయాలు షేర్ చేస్తున్నారు.

లైక్‌లు.. సర్వేలు

ఒకే విషయాన్ని పదేపదే చెబితే అబద్ధమైనా నిజమనే నమ్మే పరిస్థితి ఎదురవుతుంది. సామాజిక మాధ్యమాలు ఇప్పుడు అందుకు వేదికవుతున్నాయి. ఎదుటి పార్టీని అప్రతిష్ట పాల్జేసేందుకు ఒకే విషయాన్ని పలు కోణాల్లో పదేపదే ప్రచారం చేస్తూ ఒప్పులను తప్పులుగా, తప్పులను ఒప్పులుగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోంది. ఒక తప్పుడు సమాచారాన్ని అనుచరులే వందల్లో లైక్‌లు కొట్టి వాటి విశ్వసనీయతను పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలపై బలవంతంగా తమ అభిప్రాయాలు రుద్దే ప్రయత్నం జరుగుతోంది. సామాజిక మాధ్యమాల్లో ప్రసారం అవుతున్న వాటిలో వాస్తవమెంత? అన్న విషయాన్ని రూఢీ చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని, వాటిని గుడ్డిగా విశ్వసించడానికి వీల్లేదని మేధావులు స్పష్టం చేస్తున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ప్రత్యేకంగా సోషల్ మీడియా సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కో అభ్యర్థి కనీసం వంద మంది వరకు యువతను ఎన్నికల కోసం నియమించుకున్నారు. వీరు ఎన్నికలు పూర్తయ్యేంత సదరు పార్టీ నేత చేసే కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తుంటారు. ఇందుకోసం భారీ మొత్తాన్ని అభ్యర్థులు ఖర్చు చేస్తున్నారు. సోషల్ మీడియా టీమ్‌లను నియమించే బాధ్యతను పలు సంస్థలు చూస్తుండడం గమనార్హం.

నచ్చిన రీతిలో ప్రచారం

సామాజిక మాధ్యమాల్లో సమాచారం వెర్రితలలు వేయడం మొదలయ్యాక విశ్వసనీయత తగ్గిపోయింది. ఏది నిజమో?, ఏది అబద్ధమో తెలియని అయోమయ స్థితిలోకి ఓటర్లను నెట్టేస్తోంది. రాజకీయ పార్టీలు తమ పార్టీకి అనుకూలంగా పోస్టులు పెట్టే క్రమంలో పనిగట్టుకుని అసత్యాలను ప్రచారం చేస్తున్నాయి. ఈ తరహా ప్రచారం విషయంలో ఓటర్లు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

పశ్చిమలో గెలుపెవరిదో?

- నియోజకవర్గం ఏర్పాటైన తరువాత మూడుసార్లు ఎన్నికలు
- తొలిసారి కాంగ్రెస్ పార్టీ, రెండుసార్లు టీడీపీ విజయం
- ఈసారి టీడీపీ అభ్యర్థిగా పెతకంశెట్టి గణబాబు, వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనందకుమార్ మధ్య ప్రధాన పోటీ

నియోజకవర్గంలోని మండలాలు:	
గోపాలపట్నం, గాజువాక, ములగాడ	
నియోజకవర్గం ఓటర్లు:	2,13,439
పురుషులు	1,05,202,
స్త్రీలు	1,08,226
ఇతరులు	11 మంది

విశాఖ పశ్చిమ నియోజకవర్గం పునర్విభజనలో భాగంగా 2008లో ఏర్పడింది. అంతకుముందు ఈ ప్రాంతం పెందుర్తి నియోజకవర్గ పరిధిలో ఉండేది. పశ్చిమ నియోజకవర్గం ఏర్పాటైన తరువాత ఇప్పటివరకూ మూడుసార్లు ఎన్నికలు జరిగాయి. ఒకసారి కాంగ్రెస్, రెండుసార్లు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు గెలుపొందారు.



గణబాబు, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి



ఆడారి అనంద్‌కుమార్, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

తొలిసారి 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, తెలుగుదేశం, ప్రజారాజ్యం మధ్య ముక్కోణపు పోటీ జరిగింది. పెందుర్తి నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న పెతకంశెట్టి గణబాబుకు కాకుండా 2004 ఎన్నికల్లో మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు సతీమణి నాగమణికి టీడీపీ టికెట్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఐదేళ్ల పాటు క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్న గణబాబు 2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరి పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేశారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నుంచి మళ్ల విజయప్రసాద్, తెలుగుదేశం పార్టీ నుంచి గుడివాడ నాగమణి పోటీ చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మళ్ల విజయప్రసాద్ ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి గణబాబుపై సుమారు రెండు వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరిన గణబాబు 2014 ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున బరిలో దిగారు. అదే సమయంలో వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మళ్ల విజయప్రసాద్‌ను కాకుండా దాడి రత్నాకర్‌కు టికెట్ కేటాయించింది. వైసీపీ అభ్యర్థి దాడి రత్నాకర్‌పై టీడీపీ అభ్యర్థి పెతకంశెట్టి గణబాబు సుమారు 18 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి మళ్ల విజయప్రసాద్ మళ్లీ బరిలోకి దిగారు. తెలుగుదేశం పార్టీ నుంచి మారోమారు గణబాబు పోటీ చేసి మళ్ల విజయప్రసాద్‌పై సుమారు 16 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఈసారి జరుగుతున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే గణబాబు, వైసీపీ నుంచి ఆడారి ఆనంద్‌కుమార్‌ల మధ్య ప్రధాన పోటీ జరుగుతుంది. ఈసారి గణబాబు విజయం సాధిస్తే హ్యాట్రిక్ సాధించిట్టవుతుంది. అదే ఆడారి ఆనందకుమార్ విజయం సాధిస్తే నియోజకవర్గంలో తొలిసారి వైసీపీ జెండా ఎగురుతుంది. టీడీపీ, వైసీపీ పార్టీల మధ్య జరుగుతున్న రసవత్తరమైన పోరులో నియోజకవర్గ ప్రజలు ఈసారి ఎవరికి పట్టం కడతారో వేచి చూడాల్సిందే. ● గోపాలపట్నం

తీరంలో క్రీడా వినోదం



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఉదయం విశాఖ పార్లమెంటు టీడీపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ అతని సతీమణి తేజస్విని ఆర్కేబీచ్‌లో వాలీబాల్ ఆడారు. వాకర్స్‌ను కలిసి ఓటు అభ్యర్థించారు. అనంతరం గాదిరాజు ప్యాలెస్‌లో రాజస్థానీయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సినీ నటి, బీజేపీ నాయకురాలు నమిత శ్రీభరత్‌ను ఘనంగా సత్కరించారు. - ఎంవీపీ కాలనీ



శ్రీభరత్‌ను సత్కరిస్తున్న సినీ నటి, బీజేపీ నేత నమిత

పీవోల శిక్షణను పరిశీలించిన కలెక్టర్



సూచనలిస్తున్న జిల్లా కలెక్టరు రవి పట్టన్‌శెట్టి

ఎలమంచిలి, మే 5: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న పోలింగ్ అధికారుల శిక్షణ తరగతులను ఆదివారం జిల్లా కలెక్టరు రవి పట్టన్‌శెట్టి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉద్యోగులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ మాన్యువల్ ప్రకారం ప్రతీ అంశాన్ని గుర్తించి తగిన విధంగా పోలింగ్ నిర్వహించాలన్నారు.ఎటువంటి అనుమానాలకు తావివ్వకుండా సానుకూల దృక్పథంతో ఉండాలన్నారు. ఎలమంచిలి రిటర్నింగ్ అధికారి మనోరమ పాల్గొన్నారు.

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

» అనకాపల్లి ఆర్‌ఓ ఎం. జాహ్నవి

అనకాపల్లి టౌన్, మే 5 : ఈనెల ఆరో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు జరిగే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో అర్హులందరూ పాల్గొవాలని అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.జాహ్నవి కోరారు. పోలింగ్ పర్సనల్ అత్యవసర సర్వీసుల వారికి పోస్టల్ బ్యాలెట్ నిర్వహించేందుకు జీవీఎంసీ గవరపాలెం ఉన్నత పాఠశాల (చిన హైస్కూల్)లో సౌకర్యం కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఆదివారం ఆయా పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. బ్యాలెట్ ఓటింగ్ ఆరు, ఏడు, ఎనిమిది తేదీల్లో ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మూడు రోజులు పాటు జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు, వ్యవసాయ సర్వీసుల ఉద్యోగులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. జేసీ వెంట కశింకోట తహసీల్దార్ మధుసూదనరావు తదితరులు ఉన్నారు.

ప్రధాని మోదీ సభను జయప్రదం చేయండి

» కూటమి నేతలు పీవీఎన్ మాధవ్, దాడి రత్నాకర్

కశింకోట, మే 5 : మండలంలోని తాళ్లపాలెంలో ఏర్పాటు చేసిన ప్రజాగళం బహిరంగ సభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం రానున్నారని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం సభా ప్రాంగణంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 3.30 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం పార్లమెంటు అభ్యర్థులు, ఎమ్మెల్యే అభ్యర్థులు తరలిరావాలని కోరారు. ఈ సభకు మూడు జిల్లాల నుంచి 2లక్షల మంది రానున్నారని తెలిపారు. అందుకు తగిన ఏర్పాటు ఇప్పటికే పూర్తిచేశామని చెప్పారు. ఈ సభకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ రానున్నారన్నారు. ఈ సభలో నరేంద్రమోదీ మన ప్రాంత అభివృద్ధి నమూనా వివరిస్తారన్నారు.అనంతరం అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, బీజేపీ నాయకులు పొన్నగంటి అప్పారావు, కొణతాల అప్పలరాజు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో తాగునీటి పైపులు దగ్ధం

కశింకోట, మే 5 : మండలంలోని జట్టపురెడ్డి తుని పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న తాగునీటి పైపులు శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని ఆకతాయిలు పైపులైన్లకు నిప్పు పెట్టి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అసలే వేసవి కావడంతో ఉష్ణోగ్రతలు మరింత పెరగడంతో ఒక్కసారిగా తాగునీటి పైపులు అగ్నికి బూడిదయ్యాయని గ్రామస్థులు తెలిపారు. కాగా ఈ సంఘటనపై స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు.

కైలాసపట్నంలో తాగునీటికి ఇక్కట్లు

కోటవురట్ల, మే 5: మండలంలోని కైలాసపట్నంలో నీటి కోసం గిరిజన మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. జలజీవన్ మిషన్ పనులు అసంతృప్తిగా వదిలేయడంతో నీటి సమస్య ఏర్పడింది. కొత్త పైపులైన్లు సక్రమం వేయకపోవడం, పాత పైపులైన్లు లీకేజీల కారణంగా కైలాసపట్నంలోని గిరిజన కాలనీలో నెల రోజుల నుంచి తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. కాలనీకి దూరంగా ఒక తాగునీటి బోరు వద్దకు వెళ్లి మహిళలు నీటిని తెచ్చుకుంటున్నారు. అక్కడ రద్దీ ఉన్న సమయంలో మహిళలు గొడవలు పడుతున్నారు. గ్రామంలో నీటి సమస్యపై జెడ్‌పీటీసీ మాజీ సభ్యురాలు వంతర వెంకటలక్ష్మి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పరిష్కారం కాలేదు. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గీంతాజలి వద్ద ప్రస్తావించగా గిరిజనకాలనీలో తాగునీటి సమస్య వాస్తవమేనన్నారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జనసేన పార్టీలో పలువురు చేరిక

పాయకరావుపేట రూరల్, మే 5 : మండలంలోని పలువురు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి సమక్షంలో గుంటపల్లిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు తుమ్మలపల్లి కుమార్ కుటుంబ సభ్యులు, బంధువులు కలిపి 200 మంది జనసేన పార్టీలో చేరారు. వీరందరికీ గెడ్డం బుజ్జి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జగ్గన్నదొర, ఆరుగుల దుర్గ, తుమ్మలపల్లి లక్ష్మి, ద్రాక్షారపు లవకుమారి, నాగమణి, రమణమ్మ పాల్గొన్నారు.

తులసి చిట్ పండ్స్ అధినేత బాబ్జీ జనసేనలో చేరిక



జనసేనలో చేరుతున్న వైసీపీ నేత కర్రి బాబ్జీ

ఎస్.రాయవరం, మే 5: మండల కేంద్రానికి చెందిన వైసీపీ సీనియర్ నేత, తులసి చిట్ పండ్స్ అధినేత కర్రి బాబ్జీ ఆదివారం జనసేన పార్టీలో చేరారు. అడ్డరోడ్డు తిమ్మాపురంలో బాబ్జికి కండువా వేసి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ కర్రి బాబ్జీలాంటి నేత జనసేనలోకి రావడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ పరిశీలకుడు జగ్గన్నదొర, నాయకులు పప్పల శివ, వెలగా సుధాకర్, రెడ్డి పవన్‌కుమార్, ప్రసాదుల గణేశ్, రత్నాజి పాల్గొన్నారు.

నేడే కూటమి సభ

... 3వ పేజీ తరువాయి

సభా ప్రాంగణం జాతీయ రహదారికి ఆనుకొని ఉండడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఒకవైపు రోడ్డును పూర్తిగా వాహనాల రాకపోకలకు వినియోగించేలా ఏర్పాట్లుచేశారు. బందోబస్తు ఏర్పాట్లను విశాఖపట్నం డీఐజీ విశాల్‌గున్నీ, అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ పర్యవేక్షిస్తున్నారు. మోదీ, చంద్రబాబునాయుడుల కోసం మూడు హెలీప్యాడ్‌లను సిద్ధం చేశారు.

చంద్రబాబు పర్యటన వివరాలు

టీడీపీ అధినేత చంద్రబాబు సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు కర్నూలు నుంచి బయలుదేరి 3.40 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు. 3.50 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 4 గంటలకు కశింకోట మండలం ఉగ్గినపాలెంలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌కు సాయంత్రం చేరుకుంటారు. 4.40 గంటలకు ఉగ్గినపాలెం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి తాళ్లపాలెం సభా వేదిక వద్దకు ఐదు గంటలకు చేరుకుంటారు. సభ అనంతరం 6.40 గంటలకు రోడ్డు మార్గంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకొంటారు. అక్కడ నుంచి హైదరాబాద్ వెళ్లనున్నారు.

సీఎం రమేశ్‌పై దాడిని ఖండిస్తూ కూటమి నేతల ఆందోళన



పాయకరావుపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

పాయకరావుపేట, మే 5 : బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్‌పై మాడుగుల నియోజకవర్గంలో వైసీపీ నాయకుల దాడికి నిరసనగా ఆదివారం పట్టణంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా స్థానిక పాత పంచాయతీ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి జనసేన నాయకుడు తోట నగేశ్, టీడీపీ నాయకులు పెదిరెడ్డి శ్రీను, పల్లా విలియంకేరి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీఎం.రమేశ్‌పై వైసీపీ నాయకుల దాడిని తీవ్రంగా ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యాళ్ల వరహాలబాబు, మజ్జూరి నారాయణరావు, జూరెడ్డి ప్రసాద్, పెదిరెడ్డి పండు, వేములపూడి అప్పారావు, గుల్లా నాగరాజు, బీజేపీ నాయకులు వేముల వెంకటేశ్వరరావు, కువల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో.. మాడుగులలో బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌పై వైసీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు వర్గీయులుదాడి చేయడం పట్ల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఖండించారు. ఆదివారం రాట్నాలపాలెంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కూటమి నాయకులు బైఠాయించి నినాదాలు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు మాట్లాడుతూ తారువలో బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌పై దాడి దారుణమన్నారు. సీఎం రమేశ్‌పై దాడిచేసిన వైసీపీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దాసరి వెంట్రావు, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో.. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో వైసీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు తన అనుచరులతో బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌పై దాడి చేయించారని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి అన్నారు. సీఎం రమేశ్‌పై వైసీపీ మూకలు దాడి చేయడాన్ని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆదివారం అంబేడ్కర్ విగ్రహాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. పెదగుమ్ములూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద జనసేన, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు గెడ్డం బుజ్జి, పాకలపాటి రవిరాజు ఆధ్వర్యంలో జనసేన, బీజేపీ నాయకులు కళ్లకు నల్ల రిబ్బన్‌లతో గంతులు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేడ్కర్‌కి వినతిపత్రం అందజేశారు. అలాగే సీఎం రమేశ్‌పై జరిగిన దాడిపై గుడివాడలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ పరిశీలకులు జగ్గన్నదొర, టీడీపీ నాయకులు అబద్ధం, ఎన్ వెంకటరాజు, అల్లు నరసింహమూర్తి, గణపతిరాజు, రామకృష్ణ, జనసేన నాయకులు పప్పల శివ, వెలగా సుధాకర్, సంజీవ్, మాధవ, తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. సమస్యలు పరిష్కరిస్తా

» బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

రాంబిల్లి, మే 5 : ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇస్తే నేవీ నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తానని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని వాడనర్సాపురంలో నేవీ నిర్వాసిత మత్స్యకారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేవల్‌బేస్ ఏర్పాటుకు భూములిచ్చి నిర్వాసితులైన మత్స్యకారులకు న్యాయం చేయడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కన్నబాబురాజు నిర్వాసిత మత్స్యకారుల సమస్యలు పరిష్కరించకుండా మాయమాటలు చెపుతూ కాలయాపన చేశారు తప్ప చేసింది ఏమిలేదన్నారు. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ నేవీ నిర్వాసితులకు న్యాయం చేయకుండా నిలువునా ముంచిన ఎమ్మెల్యే కన్నబాబురాజుకు వచ్చే ఎన్నికల్లో ఓటుతో సరైన గుణపాఠం చెప్పాలని కోరారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రాగానే నిర్వాసిత మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి తాను చిత్తశుద్ధితో పాటుపడతానన్నారు. మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, జడ్‌పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నేవీ నిర్వాసితులకు తీరని అన్యాయం చేసిందన్నారు. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు గాజుగ్లాసు గుర్తుపైన, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, బీజేపీ ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌చార్జి సన్యాసినాయుడు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, కారే రాముడు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో.. కూటమితోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు అని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. ఆదివారం సెజ్ పునరావాస కాలనీ (దిబ్బపాలెం)లో కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగే బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెజ్ కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు జగన్ రెడ్డి ప్రభుత్వం మొండిచేయి చూపించిందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ నిర్వాసితులు కనీసం తాగునీరు కూడా లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, బీజేపీ ఇన్‌చార్జి రాజాన సన్యాసినాయుడు, జెడ్‌పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ భాస్కర్, బైలపూడి శ్రీరామదాసు, రాజాన విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల నాలుగు తర్వాత జగన్ ఇంటికే..

» టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత

నక్కపల్లి, మే 5: ఐదేళ్ల పాటు ప్రజలు రాక్షస పాలన భరించారని, వచ్చె నెల నాలుగు తర్వాత జగన్ ఇంటికి పోవడం ఖాయమని టీడీపీ పాయకరావుపేట అభ్యర్థిని వంగలపూడి అనిత చెప్పారు. ఆదివారం మండలంలోని ఎన్.నర్సాపురంలో ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. మహిళలు, వృద్ధులు, పిల్లలను ఆప్యాయంగా పలకరించారు. మహిళలు హారతులు పట్టారు. ఇంటింటా తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చే ఎన్‌డీఏ కూటమిని గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా వున్నారని చెప్పారు. ఎమ్మెల్యేగా తనకు సైకిల్ గుర్తుపైన, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలోటీడీపీ పరిశీలకుడు వెంకటేశ్వరరావు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

:అనితకు హారతులిస్తున్న మహిళలు →



టీడీపీతోనే యాదవులకు గుర్తింపు

» సీటు ఇచ్చి మోసం చేసిన పార్టీ వైసీపీ

» జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు



పంచకర్ల రమేశ్‌బాబును సత్కరిస్తున్న జిల్లా యాదవ సంఘం నేతలు

సబ్బవరం, మే 5 : యాదవులకు గుర్తింపు తెచ్చింది తెలుగుదేశం పార్టీ అని జనసేన పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. ఇరువాడ ప్రైవేటు కన్వెన్షన్ హాల్లో ఆదివారం జరిగిన నియోజకవర్గ యాదవుల ఆత్మీయ సమావేశం యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు భరణికాన బాబూరావు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో యాదవులు 30 వేలు ఓట్లతో మూడో స్థానంలో ఉన్నారన్నారు. వారి సమస్యలు పంచకర్ల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పంచకర్ల మాట్లాడుతూ.. తన ముందుంచిన సమస్యలన్నింటికీ పరిష్కారం జరగాలంటే ముందు కూటమిని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా సాఎం రమేశ్‌ను గెలిపించాలని కోరారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే యాదవుల సమస్యలన్నీ ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామన్నారు. యాదవులతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, విశాఖలో తన ప్రస్థానం యాదవ కుటుంబం సహకారంతోనే ప్రారంభమైందన్నారు. నేతల విజ్ఞప్తి మేరకు సీనియర్ టీడీపీ నేత, జిల్లా యాదవ సంఘం నాయకులు బాబూరావుకు మంచి గుర్తింపును తెచ్చే పదవి ఇచ్చి గౌరవిస్తామన్నారు. సీఎం రమేశ్ ఢిల్లీ స్థాయిలో పలుకుబడి కలిగిన నేత అని, వైసీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు గల్లీ స్థాయి నేతన్నారు. 13న జరిగే ఎన్నికల్లో గాజుగ్లాసుపై తనకు, కమలం గుర్తుపై ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం పంచకర్లను, సీఎం రమేశ్ సోదరుడు శ్రీనివాసులనాయుడును యాదవ సంఘం నేతలు ఘనంగా సత్కరించి, సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో నియోజకవర్గం యాదవ సంఘాల నేతలు మొల్లి ముత్యాలు, కోన సోమేశ్వరరావు, కోరాడ శ్రీను, పల్ల తాతారావు, సన్యాశిరావు, పిల్లల అప్పలనాయుడు, దుక్క శ్రీను, ఐతి సింహాచలం, వియ్యపు చిన్నా, గజ్జి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రపై ఉత్తుత్తి ప్రేమే..

... 3వ పేజీ తరువాయి

పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు నీటిని తరలించేలా ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం కశింకోట మండలం తాళ్లపాలెం వద్ద ఎత్తిపోతల పథకాలను ఏర్పాటుచేసి సుమారు 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదపూడి రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తారు. దీని నుంచి కాలువల ద్వారా అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లోని వివిధ మండలాల్లో 1.24 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేలా పథకానికి రూపకల్పన చేశారు.

పోలవరం ఎడమ ప్రధాన కాలువ 162.409 కిలోమీటరు వద్ద...అంటే అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెం నుంచి 3.4 కి.మీ. పొడవున గ్రావిటీ కెనాల్‌ను అదే మండలంలోని జమాదులపాలెం వరకూ నిర్మించనున్నారు. అక్కడ ఎత్తిపోతల పథకం ఏర్పాటుచేసి ఆరు పంపుల సహాయంతో 31.2 ఎంసీఎఫ్‌టీల నీటిని 53 మీటర్ల ఎత్తుకు ఎత్తి పోస్తారు. అదేవిధంగా తీడ వద్ద ఏర్పాటుచేయనున్న మరో ఎత్తిపోతల పథకం ద్వారా మూడు పంపుల సహాయంతో 50.6 ఎంసీఎఫ్‌టీల నీటిని 52 మీటర్ల ఎత్తుకు తీసుకువెళతారు. ఈ రెండు ఎత్తిపోతల పథకాల ద్వారా పంప్ చేసిన నీటిని 14.5 కి.మీ. పొడవున నిర్మించనున్న లీడింగ్ చానల్ ద్వారా బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల సరిహద్దుల్లో నిర్మించ తలపెట్టిన పెదపూడి జలాశయానికి తరలిస్తారు. అక్కడ నుంచి ఐదు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ద్వారా విశాఖ గ్రామీణ జిల్లాలోని వివిధ మండలాల్లో గల పంట పొలాలకు సరఫరా చేస్తారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి 2009 ఫిబ్రవరి 21న నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సబ్బవరంలో శంకుస్థాపన చేశారు. అయితే పనులు ముందుకు సాగలేదు. రాష్ట్ర విభజన తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం...సుజల స్రవంతి ప్రాజెక్టులో కదలిక తీసుకువచ్చింది. తొలిదశలో విశాఖపట్నం జిల్లాకు సంబంధించి పనులను రెండు ప్యాకేజీలుగా విభజించారు. 2017 సెప్టెంబరులో రూ.2,022 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. 2018 నవంబరు 15న అప్పటి సీఎం చంద్రబాబునాయుడు తొలిదశ పనులకు చోడవరంలో శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టారు. అయితే కాలువ తవ్వకానికి అవసరమైన భూసేకరణ జరిగేలోపు ఎన్నికలు వచ్చాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం...అప్పటికి 25 శాతం కంటే తక్కువ పనులు జరిగిన ప్రాజెక్టుల కాంట్రాక్టులను రద్దు చేయడంతో సుజల స్రవంతి ప్రాజెక్టు కూడా ఆ జాబితాలో చేరింది. కొంతకాలం తరువాత పాత కాంట్రాక్టర్‌కే నిర్మాణ పనులు అప్పగించారు. కానీ అధికారులు భూసేకరణ చేపట్టకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతున్నది. వైసీపీ ప్రభుత్వం సుజల స్రవంతి ప్రాజెక్టుకు 2019-20 బడ్జెట్‌లో రూ.170.06 కోట్లు, 2020-21 బడ్జెట్‌లో రూ.107.96 కోట్లు, 2021-22లో రూ.97.75 కోట్లు, 2022-23లో రూ.297.5 కోట్లు, 2023-24 బడ్జెట్‌లో రూ.141.79 కోట్లు కేటాయించింది. గడచిన నాలుగేళ్ల నుంచి బడ్జెట్‌లో కేటాయించిన నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. చంద్రబాబునాయుడు హయాంలో 2018లో కాంట్రాక్టర్‌కు ఇచ్చిన రూ.12.8 కోట్ల మొబిలైజేషన్ అడ్వాన్స్ తప్ప వైసీపీ ప్రభుత్వ ఎటువంటి చెల్లింపులూ జరపలేదు. గతంలో చేసిన పనులకు సంబంధించి రూ.8 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

రూ.17,050.2 కోట్లకు అంచనా సవరణ

రెండేళ్ల క్రితం ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధుల ఒత్తిడి మేరకు ప్రభుత్వం, ఈ ప్రాజెక్టు అంచనాను తాజా రేట్ల మేరకు రూ.17,050.2 కోట్లకు సవరించి ఆమోదించారు. తొలి దశ పనులు రూ.2,022 కోట్లుగానే కొనసాగించడం గమనార్హం. రెండో దశలో పనులను ఆరు ప్యాకేజీలుగా విభజించి దాంట్లో రెండు ప్యాకేజీలకు రూ.3,800 కోట్లకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. భూసేకరణకుగాను అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో డిప్యూటీ కలెక్టర్ల కార్యాలయాలు ఏర్పాటుచేశారు. రెండు దశల పనులు చేపట్టాలంటే భూమి అవసరం. మొత్తం ప్రాజెక్టుకు 16,040 ఎకరాలు అవసరం. దీంట్లో విశాఖ జిల్లాలో 393 ఎకరాలు, అనకాపల్లి జిల్లాలో 6,435 ఎకరాలకుగాను ఇప్పటివరకు 1,157.76 ఎకరాలకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేశారు తప్ప రైతులకు పరిహారం ఇవ్వలేదు. ప్రాజెక్టు పనులు ప్రారంభించాలంటే తొలుత భూమిని కాంట్రాక్టర్లకు అప్పగించాలి. అంటే రైతులకు పరిహారం ఇవ్వాలి. రైతులకు పరిహారం, పనులు చేపట్టేందుకు కనీసం రూ.నాలుగు వేల కోట్లు విడుదల చేయాలని ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధులు కోరినా ప్రభుత్వం ఇంతవరకు పైసా విడుదల చేయలేదు.

మొత్తం ఆయకట్టు ప్రాంతం ఎనిమిది లక్షల ఎకరాలు

ప్రాజెక్టులో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో 3.2 లక్షల ఎకరాలకు, విజయనగరం జిల్లాలో 3.94 లక్షల ఎకరాలకు, శ్రీకాకుళం జిల్లాలో 0.85 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలని ప్రతిపాదించారు. తొలి దశలో అనకాపల్లి జిల్లాలోని తొమ్మిది మండలాల్లో 1.3 లక్షల ఎకరాలకు, రెండో దశలో అనకాపల్లి జిల్లాలో ఆరు మండలాలు, విశాఖ జిల్లాలోని ఒక మండలం పరిధిలో మొత్తం 1.35 లక్షల ఎకరాలకు, విజయనగరం జిల్లాలో 11 మండలాల్లో 1.33 లక్షల ఎకరాలకు నీరు అందిస్తారు. తరువాత ప్రాజెక్టు మొత్తం పూర్తయిన తరువాత శ్రీకాకుళం జిల్లాలో ఆరు మండలాల్లో 0.85 లక్షల ఎకరాలతోపాటు మిగిలిన రెండు జిల్లాలో మిగిలిన ఆయకట్టును నీరు సరఫరా చేయాలని ప్రతిపాదించారు. ఇంకా మూడు జిల్లాల్లో 1200 గ్రామాల్లో ఉండే 30 లక్షల జనాభాకు, పరిశ్రమల అవసరాలకు నీటిని సరఫరా చేస్తారు. ఇందుకు గోదావరి నుంచి నుంచి 63 టీఎంసీల వరద నీటిని తరలించాల్సి ఉంటుంది. దీంట్లో సాగునీటి కోసం 54 టీఎంసీలు, తాగునీటి కోసం 4.46 టీఎంసీలు, పరిశ్రమలకు 5.84 టీఎంసీలు అవసరమని ప్రతిపాదనల్లో పొందుపరిచారు. ఇందుకోసం అనకాపల్లి జిల్లా రావికమతం మండలం పెదపూడి వద్ద 3.15 టీఎంసీలు, కె.కోటపాడు మండలం భూదేవి వద్ద 6.55 టీఎంసీలు, విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం వీరనారాయణపురం వద్ద 6.2 టీఎంసీలు, అదే మండలం తాటిపూడి వద్ద 3.8 టీఎంసీల నీరు నిల్వ కోసం జలాశయాలు నిర్మించాల్సి ఉంది.

ఐదేళ్లు ప్రజలను మోసగించిన జగన్

» జనసేన అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కొణతాల రామకృష్ణ

తుమ్మపాల, మే 5 : ఐదేళ్ల పాటు ప్రజలను మోసగిస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పబ్బం గడిపారని జనసేన అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ ఆరోపించారు. ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి తుమ్మపాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వంలో అందించే సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి ఒక ఛాన్స్ ఇవ్వాలని ప్రాధేయపడి అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారన్నారు. తొలుత తుమ్మపాల మెయిన్‌రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు



ముత్యాలమ్మపాలెంలో కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్

పరవాడ, మే 5 : మండల కేంద్రంలో సీఐ బాల సూర్యారావు ఆధ్వర్యంలో కేంద్ర పారా మిలట్రీ దళాలు ఆదివారం వాడచీపురుపల్లి, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, పెదముషిడివాడ, కన్నూరు, మడకపాలెం గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐ బాల సూర్యారావు కేంద్ర బలగాలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ 13న జరగనున్న ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు కవాతు నిర్వహించినట్టు చెప్పారు.

మాజీ వలంటీరు జనసేనలో చేరిక



జనసేనలో చేరుతున్న మాజీ వలంటీరు వెంకట మణి

ఎలమంచిలి, మే 5 : మండలంలోని లైనుకొత్తూరు మాజీ వలంటీరు ఆరుమళ్ల వెంకట మణి ఆదివారం జనసేన పార్టీలో చేరారు. ఆదివారం గ్రామ సమీపంలోని ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో వెంకట మణికి కండువాను జనసేన అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మణి మాట్లాడుతూ.. తాను వలంటీరుగా నాలుగున్నరేళ్లు పనిచేశానని, కూటమి ప్రభుత్వం ద్వారా గ్రామానికి మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో లైనుకొత్తూరు మాజీ సర్పంచ్ లవుడు లోవరాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజాన నారాయణమ్మ, జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, మండల అధ్యక్షుడు సోమునాయుడు పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న రిత్విక్ దంపతులు



అమ్మవారిని దర్శించుకుంటున్న రిత్విక్

అనకాపల్లి టౌన్, మే 5 : అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ తనయుడు రిత్విక్ దంపతులు ఆదివారం స్థానిక నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. రిత్విక్ జన్మదినం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రిత్విక్‌ను రత్నాకర్ ఘనంగా సత్కరించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

మోదీ సభను విజయవంతం చేయండి : రత్నాకర్

అనకాపల్లి టౌన్, మే 5 : కశింకోట మండలం తాళ్లపాలెంలో సోమవారం సాయంత్రం జరిగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచార సభను విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం డీవీఆర్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రధానమంత్రితో పాటు టీడీపీ నేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తారన్నారు. సభకు వచ్చే వారు భద్రతా కారణాల దృష్ట్యా ఎటువంటి హ్యాండ్‌బ్యాగులు, పర్సులు తీసుకురావద్దని సూచించారు.

ముగిసిన యోగా సహ ఉపాధ్యాయుల శిక్షణ

అనకాపల్లిటౌన్, మే 5 : స్థానిక జార్జిక్లబ్‌లో నెల రోజులుగా నిర్వహించిన యోగా అసిస్టెంట్ ఉపాధ్యాయ శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. భారత స్వాభిమాన ట్రస్ట్ అధ్యక్షుడు డి. చినబాబు, జొన్నలగెడ్డ శ్రీనివాస్, మహిళా యోగాచార్యులు జి. కృష్ణ, ట్రస్ట్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భీశెట్టి దొరమ్మనాయుడు, మంగయ్య పర్యవేక్షణలో ఈ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ప్రధాని సభను జయప్రదయం చేయాలి : ప్రగడ

అచ్యుతాపురం, మే 5: తాళ్లపాలెంలో సోమవారం జరిగే సభను విజయవంతం చేయాలని ఎలమంచిలి టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన కూటమి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈ సభలో పాల్గొంటున్నారు. అందువల్ల నియోజక వర్గం నుంచి భారీ సంఖ్యలో ఉమ్మడి నాయకులు, శ్రేణులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో కూటమి నాయకులు సీఎం రాజేష్, రాజాన రమేష్ కుమార్, కె.విజయకుమార్, రాజాన సన్యాసినాయుడు, జె.శ్రీనివాసరావు, బైలపూడి శ్రీరామదాసు పాల్గొన్నారు.

చీమలాపల్లి నుంచి జనసేనలో చేరిక

అచ్యుతాపురం, మే 5: చీమలాపల్లి నుంచి జనసేనలోకి ఆదివారం భారీగా చేరికలు జరిగాయి. అచ్యుతాపురం పార్టీ కార్యాలయంలో ఎలమంచిలి జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్ అందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ వార్డు మొండరు పెయ్యల సత్యవతి, అప్పారావు దంపతులతో వారి అనుచర గణం జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఈకార్యక్రమంలో జెడ్‌పీటీసీ మాజీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి శ్రీరామదాసు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధి బాధితుడికి జనసైనికుల చేయూత

ఎస్. రాయవరం, మే 5: కిడ్నీ వ్యాదితో బాధపడుతున్న కొత్త రేవుపోలవరం గ్రామానికి చెందిన మేరిగి జగ్గకు మండలానికి చెందిన జనసైనికులు చేయూతగా నిలిచారు. కిడ్నీ బాధితుడు మేరిగి జగ్గకు ఆదివారం జనసేన మండల సీనియర్ నేత శానాపతి బాబూరావు రూ. ఐదు వేలు, 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రిపిల్లి చినదేవుడు, దమ్ము రాజు, బన్ని, రాము, గోవింద్ పాల్గొన్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

కృష్ణాదేవిపేటలో చిరుజల్లులు

కృష్ణాదేవిపేట, మే 5 : గొలుగొండ మండలం ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్.నాగాపురం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట గ్రామాల్లో ఆదివారం సాయంత్రం చిరు జల్లు పడ్డాయి. మూడు రోజులుగా పడుతున్న వర్షాలకు ఈ ప్రాంతాలు చల్లబడ్డాయి. ఎండలకు హడలెత్తుతున్న ప్రజానీకం ఈ వర్షంతో ఉపశమనం పొందారు.

84 మంది హోమ్ ఓటు హక్కు వినియోగం

నర్సీపట్నం, మే 5 : నియోజవర్గంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న హోమ్ ఓటింగ్‌లో 84 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు, వృద్ధులు 237 మంది ఉన్న విషయం తెలిసిందే. రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాం శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద హోమ్ ఓటింగ్ ప్రక్రియను ప్రారంభించారు. శుక్ర, శనివారాల్లో నర్సీపట్నంలో 38 మంది ఓటర్లు, ఆదివారం గొలుగొండ, మాకవరపాలెంలో మరో 46 మంది మొత్తం 84 మంది ఓట్లు వేశారు. సోమవారం నాతవరంలో రెండు, మాకవరపాలెంలో ఒక బృందాలు తిరుగుతారని, హోమ్ ఓటింగ్ ప్రక్రియ కొనసాగిస్తారని అధికారులు తెలిపారు.

నాణ్యమైన తారు రోడ్లు వేస్తాం

» ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందరం రాజు



ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందరంబాబు

గొలుగొండ, మే 5: నాణ్యమైన తారు రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకున్నామని ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందరంబాబు తెలిపారు. మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరిలోవ అటవీ ప్రాంతంలో నాలుగు కిలోమీటర్ల రోడ్డును 12 అడుగుల నుంచి 24 అడుగులకు విస్తరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. నాణ్యమైన రోడ్డు వేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. రోడ్డు మధలో ఉన్న నాలుగు కల్వర్టుల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఆర్‌అండ్‌బీ జేఈ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రమేశ్‌పై దాడికి నిరసనగా టీడీపీ ఆందోళన



గొలుగొండలో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు



కృష్ణాదేవిపేటలో మాట్లాడుతున్న కూటమి నాయకులు

గొలుగొండ, మే 5: మాడుగుల నియోజకవర్గంలో బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌పై దాడికి నిరసనగా ఆదివారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద టీడీపీ నాయకులు ఆందోళన చేశారు. తొలుత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగుయువత మండల ఉపాధ్యక్షుడు గెడ్డం ఆనంద్ మాట్లాడుతూ బూడి ముత్యాలనాయుడు ఓటమి భయంతోనే ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌పై దాడి చేయించారని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గెడ్డం నానాజీ, జనసేన మండల అధ్యక్షుడు గండెం దొరబాబు, నాయకులు రేగుబళ్ల శివ, కోనా నారాయణరావు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో.. బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌పై డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అనుచరులు దాడికి నిరసనగా ఆదివారం మండల కేంద్రంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థిపైన, బీజేపీ కార్యకర్తలపైన దాడులు చేయడం దారుణమన్నారు. సీఎం రమేశ్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అల్లు రామునాయుడు, రుత్తల శేషుకుమార్, నంద కిషోర్, జోగిపాత్రుడు, లాలం రాము, బీజేపీ నాయకులు అడిగర్ల రాంబాబు, అంజనేయులుపాల్గొన్నారు.

కృష్ణాదేవి పేటలో.. బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌పై దాడిని కూటమి నాయకులు ఆదివారం తీవ్రంగా ఖండించారు. సీఎం రమేశ్‌కు అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రజాదరణ పెరగడంతో ఓటమి భయంతోనే మాడుగులలో వైసీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు అనుచరులతో దాడి చేయించారని వారు పేర్కొన్నారు.

రానున్న రోజుల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని జనసేన నాయకుడు లంక సత్యనారాయణ అన్నారు. సీఎం రమేశ్‌పై దాడిని బీజేపీ గొలుగొండ మండల అధ్యక్షుడు చందక గౌరీనాయుడు, పాతకృష్ణాదేవిపేట ఉపసర్పంచ్ దుంపలపూడి సహదేముడు, జనసేన నాయకులు ఈర్ని చిన్ని, సత్యనారాయణ, ఖండించారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం

» టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, మే 5 : వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిపోయిందని మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆదివారం ఎన్టీఆర్ మినిస్టేడింలో వాకర్స్ క్లబ్ సభ్యులతో కలిసి వాకింగ్ చేశారు. వాలీబాల్ సర్వీసు చేసి టీమ్ సభ్యులతో మాట్లాడారు. నింజాస్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్న చిన్నారులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13 తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికలలో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు సైకిల్ గుర్తుపైన, బీజేపీ ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేశ్‌కి కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. అనంతరం ఇందిరామార్కెట్, పాత బస్టాండ్ ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అక్కడ పాక హోటల్‌లో అల్పాహారం, టీ తీసుకున్నారు. ఆర్టీసీ బస్సులో మాకవరపాలెం వరకు ప్రయాణం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పాల్గొన్నారు.



పల్లెవెలుగు బస్సు నుంచి దిగుతున్న అయ్యన్నపాత్రుడు

అయ్యన్నకు ఘన స్వాగతం

మాకవరపాలెం,: నర్సీపట్నం నుంచి మాకవరపాలెం పల్లె వెలుగు బస్సులో ప్రయాణం చేసిన టీడీపీ నర్సీపట్నం అభ్యర్థి చింతకాలయ అయ్యన్నపాత్రుడుకి కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. బస్సు దిగిన ఆయన మాకవరపాలెం బస్టాండ్‌లో అరగంట పాటు కార్యకర్తలతో మాట్లాడారు. అయితే అయ్యన్నపాత్రుడు బస్సులో ప్రయాణం చేస్తున్నాడని తెలుసుకున్న టీడీపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరుకొని అయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బస్సులో ప్రయాణం చేస్తూ ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్నానని అన్నారు. బస్సు చార్జీలు, పెరిగిన దరలపై మహిళలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. అలాగే మహిళలకు టీడీపీ ఉచిత బస్సు ప్రయాణంపై మహిళల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్‌వై పాత్రుడు, అల్లు నాయుడు, రుత్తల శేషుకుమార్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడే కూటమి సభ

... 3వ పేజీ తరువాయి

సభా ప్రాంగణం జాతీయ రహదారికి ఆనుకొని ఉండడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఒకవైపు రోడ్డును పూర్తిగా వాహనాల రాకపోకలకు వినియోగించేలా ఏర్పాట్లుచేశారు. బందోబస్తు ఏర్పాట్లను విశాఖపట్నం డీఐజీ విశాల్‌గున్నీ, అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ పర్యవేక్షిస్తున్నారు. మోదీ, చంద్రబాబునాయుడుల కోసం మూడు హెలీప్యాడ్‌లను సిద్ధం చేశారు.

చంద్రబాబు పర్యటన వివరాలు

టీడీపీ అధినేత చంద్రబాబు సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు కర్నూలు నుంచి బయలుదేరి 3.40 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు. 3.50 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 4 గంటలకు కశింకోట మండలం ఉగ్గినపాలెంలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌కు సాయంత్రం చేరుకుంటారు. 4.40 గంటలకు ఉగ్గినపాలెం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి తాళ్లపాలెం సభా వేదిక వద్దకు ఐదు గంటలకు చేరుకుంటారు. సభ అనంతరం 6.40 గంటలకు రోడ్డు మార్గంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకొంటారు. అక్కడ నుంచి హైదరాబాద్ వెళ్లనున్నారు.

బాటసారులకు సేదతీర్చే.. వేసవి విడిదిలు!

» మోదకొండమ్మ సతకం పట్టు వద్ద చలువ పందిరితో ఉపశమనం



చలువ పందిరి నీడలో మోదకొండమ్మ అమ్మవారి సతకం పట్టు

మాడుగుల రూరల్, మే 5: మాడుగులలో రాజులు కోట వద్ద మోదకొండమ్మ అమ్మవారి పాదాలు (సిమెంట్‌తో తయారు చేసినవి) ఉంచి తాటాకులనేసిన పందిరి వేసిన సతకం పట్టు భక్తులకు, పాదచారులు, కూలీలకు, వృద్ధులకు ఎంతగానో సేదతీరుస్తున్నది. పూర్వీకులు ఇక్కడ పెద్ద రావిచెట్టు కింద అమ్మవారి పాదాలు ఏర్పాటు చేశారు. ఈ ప్రదేశాన్ని అమ్మవారి సతకం పట్టు అని పిలుస్తుంటారు. ఏటా మే గాని జూన్‌నెలలోకానీ జాతర చేస్తుంటారు. జాతర జరిపే నెలరోజులు ముందు అమ్మవారి ఆలయంలో ఉన్న ఇత్తడి పాదాలు, ఘటాలను తీసుకు వచ్చి సతకం పట్టు వద్ద కొలువు ఉంచుతారు. తర్వాత తీసువెళ్తారు. ఏటా జాతరకు నెల రోజులు ముందు తాటాకులు తెచ్చి పందిరి వేస్తారు.ఈ పందిరి ప్రజలకు నీడనిచ్చి ఎంతో సేదతీరుస్తున్నది. ఇక్కడికి భక్తులు అమ్మవారి పాదాలను దర్శించుకునేందుకు వస్తుంటారు. కాగా రావిచెట్టు, సం తకం పట్టు కింద ఎంతో చల్లగా ఉండడంతో అక్కడికి వృద్ధులు, రోజు వారి పనులు చేసుకునే కూలీలు సతకం పట్టుకి వచ్చి సేదతీరుతుంటారు. అమ్మవారి పాదాలు చెంత ఉంటే మానసిక ప్రశాంతత, ఎండవేడిమి నుంచి ఉపశమనం కలుగుతాయని చెబుతుంటారు. అందుకే మాడుగులలో అమ్మవారి సతకంపట్టుకి ప్రత్యే కత ఉంది. చల్లని తల్లి చెంత ఉంటే మాకు చింతలేమి అన్న ట్లుగా భక్తులు, ప్రజలు తమ విశ్వాస్వాన్ని చాటుకుంటారు.

సీనియర్ విలేకరి అప్పారావు మృతి

నర్సీపట్నం, మే 5 : నర్సీపట్నంలో సీనియర్ విలేకరి వడ్లమూరి అప్పారావు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆదివారం అప్పారావు ఆరోగ్యం మరింత క్షీణించడంతో భార్య, కుమారులు నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆయన మృతి చెందారు. ఆయన మృతికి సీపీఎం నాయకులు అడిగర్ల రాజు, త్రిమూర్తులు రెడ్డి పార్టీ జెండా కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు సీహెచ్ బీఎల్ స్వామి, లంక రామచంద్రరావు, రాము, ఇ. అప్పారావు సంతాపం వ్యక్తం చేశారు.

చోడవరం
నియోజకవర్గం

సీఎం రమేష్‌పై వైసీపీ వర్గీయుల దాడి అమానుషం

» మాజీ ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు



ఎస్ ఎన్ ఎస్ రాజు

చోడవరం, మే 5: దాడికి గురైన కార్యకర్తలను పరామర్శించేందుకు వెళ్లిన అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌పై డిప్యూటీ సీఎం బూడి వర్గీయులు దాడులకు తెగబడడం అమానుషమని, ప్రజాస్వామ్యవాదులంతా దీనిని ఖండించాలని మాజీ ఎ మ్మెల్యే కేఎస్ ఎన్ఎస్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రచారం చేసుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది, అలాంటి వారిని అడ్డుకొని, వారిపై దాడుల కు తెగబడడం మంచిపద్ధతి కాదన్నారు. అధికార పార్టీ నాయకులు ఇలాంటి సంస్కృతిని ప్రోత్సహించడం సరికాదని స్పష్టం చేశారు.

మోడీ సభను విజయవంతం చేయండి

కశింకోటలో ఈనెల 6 సోమవారం సాయంత్రం జరగనున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే రాజు కార్యకర్తలకు నాయకులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి పంచాయతీ నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఈ సభకు హాజరుకావాలని కోరారు.

తేలికపాటి జల్లులు

మాడుగుల రూరల్, మే 5: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం తేలికపాటి జల్లులతో వర్షం పడింది. ఉదయంనుంచి ఎండతీవ్రంగా ఉన్నా సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై జల్లులతో వర్షం పడింది. ప్రజలు కాస్త ఉపశమనం పొందారు.



మాట్లాడుతున్న సీఎం రమేష్



సంఘీభావం తెలుపుతున్న కూటమి నాయకులు

రైవాడ ప్రాజెక్టు రైతులకు అంకితం చేస్తా

» అభివృద్ధిలో మాడుగులను రాష్ట్రంలోనే గుర్తింపు తెస్తా

» అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్

దేవరాపల్లి, మే 5: దేవరాపల్లి ప్రాంతంలో పూర్తిస్థాయిలో సాగుకు ఉపయోగపడేలా రైవాడ నీటిని రైతులకు అంకితం చేయడమే కాకుండా, వారికి ఉపయోగ పడేలా కోల్డ్ స్టోరేజీ ప్రతి మండలంలో ఏర్పాటు చేసి అన్నదాతలను రారాజును చేస్తానని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం.రమేష్ అన్నారు. మండల కేంద్రంలో కిలపర్తి భాస్కరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఆదివారం పాల్గొని మాట్లాడారు. రైతాంగానికి అధిక ప్రాధాన్యత ఇ వ్వడంతోపాటు యువతకు స్కిల్‌డెవలప్‌మెంటులో శిక్షణ అందిస్తామన్నారు. వివిధ పరిశ్రమలు తీసుకు వచ్చి మాడుగులను రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా తీర్చి దిద్దుతానన్నారు. రైతు పండించే పంట ఎగుమతి చేసేలా చర్యలు చేపట్టి ఆర్థికంగా ఎదిగేందుకు చర్యలు చేపడతానన్నారు. మూడు, నాలుగు లైన్‌ల రోడ్లు వేసి ఈప్రాంతాన్ని సుందరంగా తయారు చేస్తానన్నారు. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తానన్నారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావును గుం డెల్లో పెట్టి చూసుకుంటానన్నారు. కొద్దిరోజులు కష్టపడితే.. ఐదేళ్లు మీకు సే వకుడిగా ఉంటానన్నారు. ఏ ఆపద ఎదురైనా మూడు గంటల్లో ఎక్కడున్నా మీవద్దకు వాలుతానన్నారు. ఈ ప్రాంతంలో భయపెట్టే నాయకులు త్వరలోనే తానంటే ఏమిటో చూపిస్తా హెచ్చరించారు. ఏ కార్యకర్తకు అన్యాయం జరిగినా సహించే ప్రసక్తిలేదన్నారు. మండల కేంద్రం దేవరాపల్లి, నందిపల్లి, మారేపల్లి, కాశీపురం, నాగయ్యపేట, రైవాడ, వాకపల్లి గ్రామాల నుంచి పా ర్టీ లో చేరారు. ఇంజనీరింగ్ కళాశాల తీసుకువస్తానన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి బ ండారు సత్యనారాయణమూర్తి, గవిరెడ్డిరామానాయుడు, పైలాప్రసాదరావు, పీవీజీకుమార్, బుద్దనాగ జగదీశ్వరరావు, తాతయ్యబాబు, రామ్మూర్తినాయు డు తదితరులు పాల్గొన్నారు.

ఎండలతో కూలీల అవస్థలు

మాడుగుల, మే 5 : ఎండలకు ఉపాధి హామీ పనుల కూలీలతో పాటు వివిధ పనుల కోసం వెళ్లిన వారు నానా అవస్థలు పడుతున్నారు. ఉదయం ఆరు గంటలకు పనులకు వెళ్లి మధ్యాహ్నం 11 గంటల సమయానికి ఇంటికి తిరుగుముఖం పడుతున్నారు. 9గంటల నుంచే ఎండతీవ్రత, వడగాల్పులు వీయడంతో తీ వ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇలానే ఎండలుంటే రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



మాడుగుల
నియోజకవర్గం

ఘనంగా మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు



మాడుగుల, మే 5: ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం కమిటీ సభ్యులు పర్యవేక్షణలో ప్రత్యేక పూ జా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజాము అరుగంటలకు గర్భగుడిలోని అమ్మవారికి అలంకరించి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక, స్థానికేతర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.



ఘటాలతో అమ్మవారి ఆలయానికి వెళ్తున్న భక్తులు

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా

చోడవరం కూటమి అభ్యర్థి కేఎస్ఎన్ఎస్.రాజు

రోలుగుంట, మే 5: ప్రతీ గ్రామంలో సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి కృషి చేస్తానని చోడవరం నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ఎన్ఎస్.రాజు హామీ ఇచ్చారు. ఆదివారం మండలంలోని నిండుగొండ, కె.నాయుడుపాలెం, కొవ్వూరు, రోలుగుంట గ్రామాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని పథకాలను అమలు చేస్తామన్నారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి, డ్రైనేజీ రోడ్డు సమస్యలను కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన వెంటనే పరిష్కరిస్తామన్నారు. గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 27 సంక్షేమ పథకాలను ఈ ప్రభుత్వం రద్దు చేసి వారికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున కార్యకర్తలు, నాయకులు ప్రతీ ఇంటికి వెళ్లి జగన్ అన్యాయాలను వివరించాలన్నారు. టీడీపీ అవసరం ఏమిటో ప్రజలకు తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుమాలూరు చంద్రమౌళి, క్లస్టర్ ఇన్‌చార్జి సుర్ల బాబులునాయుడు, నాయకులు సుర్ల రామకృష్ణ, కోలిపల్లి ఈశ్వరరావు, బంటు రాజు తదితరులు పాల్గొన్నారు.



నిండుగొండలో ప్రచారం చేస్తున్న కేఎస్ఎన్ఎస్ రాజు

గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

» ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చీడికాడ, మే 5: మండలంలో కోనాం, శిరిజాం తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం కురిసిన వర్షం, గాలులకు ఐదు విద్యుత్ స్తంభాలు నేలకొరిగి విద్యుత్ అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే. 'ఆంధ్రజ్యోతి' దీనిపై కథనం రావడంతో స్పందించిన విద్యుత్ అధికారులు ఏఈ నమ్మి వెంకటరావు ఆధ్వర్యంలో ఈ రెండు గ్రామాల్లో పడి పోయిన విద్యుత్ స్తంభాలను, లైన్‌మేన్లు, సిబ్బంది పునరుద్ధరించారు. శనివారం సాయంత్రం 4గంటలకు పోయిన విద్యుత్ ఆదివారం మధ్యా హ్నం విద్యుత్ సరఫరా ఎట్టకేలకు పునరుద్ధరిం చారు. దీంతో ఆయా రెండు పంచాయతీలకు చెందిన వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



విద్యుత్ పనులు చేస్తున్న కార్మికుడు

ఉత్తరాంధ్రపై ఉత్తుత్తి ప్రేమే..

... 3వ పేజీ తరువాయి

పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు నీటిని తరలించేలా ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం కశింకోట మండలం తాళ్లపాలెం వద్ద ఎత్తిపోతల పథకాలను ఏర్పాటుచేసి సుమారు 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదపూడి రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తారు. దీని నుంచి కాలువల ద్వారా అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లోని వివిధ మండలాల్లో 1.24 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా పథకానికి రూపకల్పన చేశారు.

పోలవరం ఎడమ ప్రధాన కాలువ 162.409 కిలోమీటరు వద్ద..అంటే అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెం నుంచి 3.4 కి.మీ. పొడవున గ్రావిటీ కెనాల్‌ను అదే మండలంలోని జమాదులపాలెం వరకూ నిర్మించనున్నారు. అక్కడ ఎత్తిపోతల పథకం ఏర్పాటుచేసి ఆరు పంపుల సహాయంతో 31.2 ఎంసీఎఫ్‌టీల నీటిని 53 మీటర్ల ఎత్తుకు ఎత్తిపోస్తారు. అదేవిధంగా తీడ వద్ద ఏర్పాటుచేయనున్న మరో ఎత్తిపోతల పథకం ద్వారా మూడు పంపుల సహాయంతో 50.6 ఎంసీఎఫ్‌టీల నీటిని 52 మీటర్ల ఎత్తుకు తీసుకువెళతారు. ఈ రెండు ఎత్తిపోతల పథకాల ద్వారా పంప్ చేసిన నీటిని 14.5 కి.మీ. పొడవున నిర్మించనున్న లీడింగ్ చానల్ ద్వారా బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల సరిహద్దుల్లో నిర్మించతలపెట్టిన పెదపూడి జలాశయానికి తరలిస్తారు. అక్కడ నుంచి ఐదు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ద్వారా విశాఖ గ్రామీణ జిల్లాలోని వివిధ మండలాల్లో గల పంట పొలాలకు సరఫరా చేస్తారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి 2009 ఫిబ్రవరి 21న నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సబ్బవరంలో శంకుస్థాపన చేశారు. అయితే పనులు ముందుకు సాగలేదు. రాష్ట్ర విభజన తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం...సుజల స్రవంతి ప్రాజెక్టులో కదలిక తీసుకువచ్చింది. తొలిదశలో విశాఖపట్నం జిల్లాకు సంబంధించి పనులను రెండు ప్యాకేజీలుగా విభజించారు. 2017 సెప్టెంబరులో రూ.2,022 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. 2018 నవంబరు 15న అప్పటి సీఎం చంద్రబాబునాయుడు తొలిదశ పనులకు చోడవరంలో శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టారు. అయితే కాలువ తవ్వకానికి అవసరమైన భూ సేకరణ జరిగేలోపు ఎన్నికలు వచ్చాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం...అప్పటికి 25 శాతం కంటే తక్కువ పనులు జరిగిన ప్రాజెక్టుల కాంట్రాక్టులను రద్దు చేయడంతో సుజల స్రవంతి ప్రాజెక్టు కూడా ఆ జాబితాలో చేరింది. కొంతకాలం తరువాత పాత కాంట్రాక్టర్‌కే నిర్మాణ పనులు అప్పగించారు. కానీ అధికారులు భూసేకరణ చేపట్టకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతున్నది. వైసీపీ ప్రభుత్వం సుజల స్రవంతి ప్రాజెక్టుకు 2019-20 బడ్జెట్‌లో రూ.170.06 కోట్లు, 2020-21 బడ్జెట్‌లో రూ.107.96 కోట్లు, 2021-22లో రూ.97.75 కోట్లు, 2022-23లో రూ.297.5 కోట్లు, 2023-24 బడ్జెట్‌లో రూ.141.79 కోట్లు కేటాయించింది. గడచిన నాలుగేళ్ల నుంచి బడ్జెట్‌లో కేటాయించిన నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. చంద్రబాబునాయుడు హయాంలో 2018లో కాంట్రాక్టర్‌కు ఇచ్చిన రూ.12.8 కోట్ల మొబిలైజేషన్ అడ్వాన్స్ తప్ప వైసీపీ ప్రభుత్వ ఎటువంటి చెల్లింపులూ జరపలేదు. గతంలో చేసిన పనులకు సంబంధించి రూ.8 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

రూ.17,050.2 కోట్లకు అంచనా సవరణ

రెండేళ్ల క్రితం ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధుల ఒత్తిడి మేరకు ప్రభుత్వం, ఈ ప్రాజెక్టు అంచనాను తాజా రేట్ల మేరకు రూ.17,050.2 కోట్లకు సవరించి ఆమోదించారు. తొలి దశ పనులు రూ.2,022 కోట్లుగానే కొనసాగించడం గమనార్హం. రెండో దశలో పనులను ఆరు ప్యాకేజీలుగా విభజించి దాంట్లో రెండు ప్యాకేజీలకు రూ.3,800 కోట్లకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. భూసేకరణకుగాను అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో డిప్యూటీ కలెక్టర్ల కార్యాలయాలు ఏర్పాటుచేశారు. రెండు దశల పనులు చేపట్టాలంటే భూమి అవసరం. మొత్తం ప్రాజెక్టుకు 16,040 ఎకరాలు అవసరం. దీంట్లో విశాఖ జిల్లాలో 393 ఎకరాలు, అనకాపల్లి జిల్లాలో 6,435 ఎకరాలకుగాను ఇప్పటివరకు 1,157.76 ఎకరాలకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేశారు తప్ప రైతులకు పరిహారం ఇవ్వలేదు. ప్రాజెక్టు పనులు ప్రారంభించాలంటే తొలుత భూమిని కాంట్రాక్టర్లకు అప్పగించాలి. అంటే రైతులకు పరిహారం ఇవ్వాలి. రైతులకు పరిహారం, పనులు చేపట్టేందుకు కనీసం రూ.నాలుగు వేల కోట్లు విడుదల చేయాలని ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధులు కోరినా ప్రభుత్వం ఇంతవరకు పైసా విడుదల చేయలేదు.

మొత్తం ఆయకట్టు ప్రాంతం ఎనిమిది లక్షల ఎకరాలు

ప్రాజెక్టులో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో 3.2 లక్షల ఎకరాలకు, విజయనగరం జిల్లాలో 3.94 లక్షల ఎకరాలకు, శ్రీకాకుళం జిల్లాలో 0.85 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలని ప్రతిపాదించారు. తొలి దశలో అనకాపల్లి జిల్లాలోని తొమ్మిది మండలాల్లో 1.3 లక్షల ఎకరాలకు, రెండో దశలో అనకాపల్లి జిల్లాలో ఆరు మండలాలు, విశాఖ జిల్లాలోని ఒక మండలం పరిధిలో మొత్తం 1.35 లక్షల ఎకరాలకు, విజయనగరం జిల్లాలో 11 మండలాల్లో 1.33 లక్షల ఎకరాలకు నీరు అందిస్తారు. తరువాత ప్రాజెక్టు మొత్తం పూర్తయిన తరువాత శ్రీకాకుళం జిల్లాలో ఆరు మండలాల్లో 0.85 లక్షల ఎకరాలతోపాటు మిగిలిన రెండు జిల్లాలో మిగిలిన ఆయకట్టును నీరు సరఫరా చేయాలని ప్రతిపాదించారు. ఇంకా మూడు జిల్లాల్లో 1200 గ్రామాల్లో ఉండే 30 లక్షల జనాభాకు, పరిశ్రమల అవసరాలకు నీటిని సరఫరా చేస్తారు. ఇందుకు గోదావరి నుంచి నుంచి 63 టీఎంసీల వరద నీటిని తరలించాల్సి ఉంటుంది. దీంట్లో సాగునీటి కోసం 54 టీఎంసీలు, తాగునీటి కోసం 4.46 టీఎంసీలు, పరిశ్రమలకు 5.84 టీఎంసీలు అవసరమని ప్రతిపాదనల్లో పొందుపరిచారు. ఇందుకోసం అనకాపల్లి జిల్లా రావికమతం మండలం పెదపూడి వద్ద 3.15 టీఎంసీలు, కె.కోటపాడు మండలం భూదేవి వద్ద 6.55 టీఎంసీలు, విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం వీరనారాయణపురం వద్ద 6.2 టీఎంసీలు, అదే మండలం తాటిపూడి వద్ద 3.8 టీఎంసీల నీరు నిల్వ కోసం జలాశయాలు నిర్మించాల్సి ఉంది.